
జ్యోతి
80 పైసలు
Eswar

సుచిత్ర మాసపత్రిక

బకింగ్‌హాంపేట పోస్టు

విజయవాడ-2

విడిప్రతి వెల

80 పైసలు

ఏడాది చందా

9-50 రూపాయలు

సంపుటి 5

డిసెంబరు 1967

సంచిక 12

మేనేజింగ్ ఎడిటర్

వి. వి. రాఘవయ్య

ముఖచిత్రం కె వి పిక్చర్స్‌వారి 'సతీ అరుంధతి'లో దృశ్యాలు

రాజకీయాలు

ఎన్నికలు జరిగి నవమాసాలైనా కాకుండా అప్పుడే రెండు రాష్ట్రాలు హర్యానా, మణిపూర్ - రాష్ట్రపతి పాలన క్రిందికిపోయాయి.

పశ్చిమ బెంగాల్‌లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని గవర్నరు డిస్మిస్‌చేసి శ్రీ పి. సి ఘోష్ ముఖ్యమంత్రిగా కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

పంజాబులో శ్రీ గుర్నాం సింగ్ ప్రభుత్వం రాజీనామా ఇచ్చింది.

ఇవి నవంబరులో ఆకస్మికంగా, ఆశ్చర్యకరంగా జరిగిన పరిణామాలు.

మణిపూర్‌లో ఎన్నికల తరువాత ఏర్పడిన కాంగ్రెసు ప్రభుత్వం కొందరు కాంగ్రెసు శాసన సభ్యులు ప్రతిపక్షంలో చేరడంతో పడిపోయింది. కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడింది. అది కూడా మూణ్ణాళ్ళ ముచ్చటే అయింది. కాంగ్రెసు, కాంగ్రెసేతర పక్షాల బలం సమానం కావడంతో ప్రతిష్టంభన ఏర్పడి ఏ పార్టీ ప్రభుత్వం నిలబడడానికివీలు లేకపోయింది. ఈ పరిస్థితిలో శాసన సభను రద్దుచేసి రాష్ట్రపతిపాలనను ప్రకటించటమే గత్యంతరమైంది.

హర్యానాలో దినదినానికి క్షణ క్షణానికి రాజకీయ పార్టీల బలాబలాలు మారిపోతున్నాయి. తన మంత్రివర్గానికి ముప్పువాటిల్లినప్పుడల్లా ముఖ్యమంత్రి శ్రీ వీరేంద్రసింగ్ కొత్తమంత్రులను చేరుస్తూ గండాన్ని తప్పించుకుంటున్నారు. ఒకనాడు కాంగ్రెసుది మెజారిటీ అయితే, మరొనాడు సంయుక్తదళ్‌ది మెజారిటీ అవుతున్నది. ఈ పరిస్థితిలో మంత్రి వర్గాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించడమే మార్గమని కేంద్రం భావించింది.

ఒకప్పుడు కాంగ్రెసు గోత్రీకుడే అయిన శ్రీ అజయ్‌ముఖర్జీ లెఫ్టు, రైటు కమ్యూనిస్టుపార్టీలతో, ఇంకా ఇతర వామపక్షాలతో చేరి మంత్రివర్గాన్ని



శ్రీ అజయ్ ముఖర్జీ

స్థాపించారు. అదిమొత్తం 14 పార్టీల కలయిక. దేనిదాని దానిది. కాని, అన్నిటి ధ్యేయం దేనికి అది బలపడడం. దీనితో పశ్చిమ బెంగాల్ పరిస్థితి చాలా శోచనీయంగా తయారైంది. శాంతి భద్రతల పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. లెఫ్టు కమ్యూనిస్టులు అశాంతిని రెచ్చగొడుతున్నారని, చైనా అనుకూల ధోరణిలో ప్రవర్తిస్తున్నారని తీవ్రమైన ఆరోపణలు చేసిన శ్రీ అజయ్‌ముఖర్జీ తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా ఇవ్వబోవడం వరకు వెళ్ళి మళ్ళీ యునైటెడ్ ఫ్రంట్ నాయకుల ఒత్తిడి మూలంగా మానేశారు.

కాని, ఇప్పుడు మరో గండాన్ని ఆయన మంత్రివర్గం ఎదుర్కొంటోంది. ముఖర్జీ ప్రభుత్వంలో ఆహార మంత్రిగా వున్న శ్రీ పి. సి. ఘోష్ రాజీనామా ఇచ్చారు. ఆయనతో పాటు మరో 17గురు శాసనసభ్యులు ఫ్రంట్ నుంచి తప్పుకున్నారు. దానితో ముఖర్జీ ప్రభుత్వ పక్షానికి మెజారిటీ పోయినట్లు ప్రతిపక్షం వాదిస్తున్నది.

శ్రీ పి. సి. ఘోష్ నాయకత్వాన వామపక్షేతర మిశ్రమ ప్రభుత్వం ఏర్పడితే బలపరచడానికి కాంగ్రెసు సిద్ధంగా వున్నది. అందుచేత తమ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కాంగ్రెసు, కేంద్రప్రభుత్వం కలిసి కుట్ర చేశాయని, ఆ కుట్రను తాము ప్రతిఘటిస్తామని, ప్రజల బలం తమకున్నదని శ్రీ ముఖర్జీ, ఉప ముఖ్య మంత్రి శ్రీ జ్యోతిబాసు హెచ్చరికలు చేస్తున్నారు.


శాసనసభలో బలాబలాలు తేల్చుకోవలసిందిగా గవర్నరు శ్రీ ధర్మవీర ముఖ్యమంత్రి శ్రీ ముఖర్జీకి సలహా ఇచ్చారు. కాని, శ్రీ ముఖర్జీ శాసనసభ సమావేశాన్ని డిసెంబరు 18వ తేదీకి ఏర్పాటుచేసి తాత్సారం చేస్తున్నారు.

శాసనసభ సమావేశాన్ని తాను సలహా ఇచ్చిన విధంగా ముఖ్యమంత్రి ఏర్పాటు చేయకపోతే గవర్నరు ఏంచేయాలి? మెజారిటీపార్టీ నాయకుని ఆహ్వానించి, కొత్త ప్రభుత్వాన్ని ఏర్పరచవచ్చునా? లేదా శాసనసభనే సస్పెండుచేసి రాష్ట్రపతి పాలనను విధించవచ్చునా?

ఈ ప్రశ్నలకు సుప్రీంకోర్టు నుంచి సమాధానాలను సేకరించాలని పశ్చిమ బెంగాల్ ఐక్యసంఘటన మంత్రివర్గం రాష్ట్రపతికి సూచించింది. ఈ ప్రతిపాదనను రాష్ట్రపతి తిరస్కరించడం, శాసనసభను సత్వరం సమావేశపరచి బలాబలాల పరీక్షకు మంత్రివర్గం విముఖతను ప్రదర్శించడంతో రాజ్యాంగ సంక్షోభాన్ని నివారించడానికి అజయ్‌ముఖర్జీ మంత్రివర్గాన్ని గవర్నరు బర్తరఫ్ చేయడం, డాక్టర్ పి. సి. ఘోష్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో పశ్చిమ బెంగాల్ రాజకీయ పరిణామాలు నూతన ఘట్టంలో ప్రవేశించాయి.

కొన్ని కాంగ్రెసేతర రాష్ట్రాలలో జరుగుతున్న దానితో పోలిస్తే కాంగ్రెసు రాష్ట్రాలు చాలా ప్రశాంతంగా వున్నాయని చెప్పాలి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయంగా నిలకడగా వున్న రాష్ట్రాలలో ఒకటి. కాంగ్రెసుకు నమ్మకమైన పెద్ద మెజారిటీ వుంది. కాంగ్రెసులో రెండు వర్గాలున్నమాట నిజమే కాని, వాటి తగవులు పార్టీ వరకే పరిమితమై వున్నాయి. ఈ మధ్య పి. సి. సి. ఎన్నికల విషయంలో కొంత దుమారం లేచింది. కాని, పెద గొడవ చేయకుండానే అది తగ్గిపోయింది. ప్రదేశ్ కాంగ్రెసు సంఘంలో బ్రహ్మానందరెడ్డి వర్గం సుస్థిరమైన మెజారిటీలో వుంది. అయితే అసంతృప్తి వర్గాన్ని కూడా సమాధాన పరచడంలో ఆయన మరొకసారి తన రాజకీయ చాతుర్యాన్ని ప్రదర్శించగలిగారు.


◆ ◆ ◆



శ్రీ కామరాజ్

అఖిలభారత కాంగ్రెసు అధ్యక్ష పదవి ఎన్నిక ఒకటి పెద్ద సమస్య అయింది. శ్రీ కామరాజ్ అధ్యక్ష పదవీకాలంలో కాంగ్రెసు బాగా దెబ్బతిన్నది. కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెసు పదభ్రష్టమైంది. మిగిలిన రాష్ట్రాలలో తన పూర్వపు బలాన్ని కోల్పోయింది. దీనికి బాధ్యత అంతా ఆయనకు అంటుగట్టడం భావ్యం కాదుకాని, సంస్థ వ్యవహారాలలో ఆయన అన్ని సందర్భాలలోను వివేకంతో వ్యవహరించలేదనే నింద ఒకటి ఆయనకు రాకపోలేదు.

అంతేకాక, ఇంతవరకు రాష్ట్రాలలో మాత్రమే సంస్థకు, ప్రభుత్వానికి మధ్య వుంటూ వచ్చిన విభేదాలు ఇప్పుడు కేంద్రానికి కూడా ప్రాకాయి. ప్రధానికి, కాంగ్రెసు అధ్యక్షునికి అభిప్రాయ భేదాలున్నవన్న సంగతి బహిరంగ రహస్యమే. కాంగ్రెసు




సినీమా తార పద్మిని చెప్పుచున్నది,
'నా సౌందర్య పోషణకు, నాంది
-లక్స్'
LUX
TOILET SOAP
లక్స్ టాయ్‌లెట్ సబ్బు
సినీమాతారలకు సౌందర్యమునిచ్చే సబ్బు

జ్యోతి

అధ్యక్షుడుగా తనను అన్ని విధాలా సమర్థించే వ్యక్తి వుండాలని ప్రధాని అభిప్రాయ పడుతున్నట్లుంది. తాను ప్రధాని కావడానికి ముఖ్యకారకులైన శ్రీ కామరాజ్ అధ్యక్షుడుగా వుంటే ఈ ఆశయం నెరవేరదు. కనుక అధ్యక్ష పదవిలో మార్పు రావాలని ఆమె అభిలషిస్తోంది.

జబల్పూర్‌లో అక్టోబరు మాసాంతంలో జరిగిన ఎ ఐ సి. సి. సమావేశ సమయంలో ఈ సమస్యపై ఒక నిర్ణయం జరగవలసిందే కాని జరగలేదు. శ్రీ కామరాజ్ తనను అంతా ఏకగ్రీవంగా బలపరిస్తే తప్ప పదవిలో వుండడానికి ఇష్టపడ లేదు. శ్రీ గుల్జారీలాల్ నందా అభ్యర్థిత్వాన్ని శ్రీమతి గాంధి బలపరుస్తున్నారని తెలుస్తోంది. శ్రీ నందా అభ్యర్థిత్వానికి అగ్రనాయకులలో చాలమంది వ్యతిరేకులు, ఆయన నిలబడితే శ్రీ పాటిల్ పోటీ చేస్తారు. కాంగ్రెసు ప్రస్తుత పరిస్థితిలో పోటీ జరిగితే సంస్థ ఇంకా బలహీనం కాగలదని శ్రీ కామరాజ్ భావం. అందువల్ల పోటీ లేకుండా అభ్యర్థిని నిర్ణయించే అధికారం ప్రధానికి, శ్రీ కామరాజ్ కు కాంగ్రెసు అధిష్ఠానవర్గం అప్పగించింది. ఎవరు అధ్యక్షుడైనా పతనోన్ముఖమైన కాంగ్రెసును పునరుద్ధరించలేరన్నది నిర్వివాదం. □□□


మనం ఎన్నో చిన్న చిన్న
వాట్లలోనే పొదుపు..
చెయ్యొచ్చు....
మంత్రి శ్రీ లాభేశ్వరరావు
కొంచెం బాగా
విప్పండి మాష్టారూ
పేపర్లలో
ఆఫీసుకి పోతున్నా
తలుపేసుకో...
బట్టల్లో....
పెద్ద
పీకేనోయ్!
భలే...!
సిగరెట్లలో...


ఇద్దరం ఎందుకూ..?
సినిమా...
రెండోమాటు
సినిమాకి
నవల

గాయక శచీంద్ర బర్మన్

శచీ(ంద్ర) దేవవర్మ అనే పేరు బెంగాలీ రూపంలో 'సచీన్ దేబ్(వ్) బర్మన్'గా మార్పు పొందిం దనుకుంటాను.

నిజానికి నా దృష్టిలో భారతీయ చలనచిత్ర సంగీత జగత్తులోని గాయక–సంగీతదర్శకులలో పంకజ్ మల్లిక్, కీర్తిశేషుడు అరుణ్ కుమార్, హేమంతకుమార్‌లు త్రిమూర్తులైతే, ఎస్ డి. బర్మన్ దేవేంద్రుడి లాంటి వాడు

హిందీ సినిమా గాయకులలో నాకు ఈ క్రింది క్రమంలో ఐదుగురు అభిమానులు: పంకజ్ మల్లిక్, కె. ఎల్. సైగల్, అరుణ్ కుమార్, హేమంతకుమార్, ఎస్. డి. బర్మన్. (194½ లో కలకత్తాలో సైగల్‌ని కలుసుకునే అదృష్టం కలిగింది నాకు)

సంగీత దర్శకులుగా నా వరుస ఇది: పంకజ్ మల్లిక్, ఎస్. డి. బర్మన్, అరుణ్ కుమార్, హేమంత కుమార్, ఆర్. సి. బోరల్.

ఈ ఉపోద్ఘాతం ఎందుకు వ్రాస్తున్నానంటె–నా కసలీ వ్యాసం వ్రాయడానికి అవకాశం ఎలా లభించిందో పాఠకులకు మనవి చేయాలని.

ఈనాడు ప్రజలు ఎక్కువగా మెచ్చుకునే ఒక ప్రఖ్యాత హిందీ నేపథ్య గాయకుని గొంతు నాకు నచ్చలేదు. రేడియోలో, వీధులలోని మైక్‌లద్వారా వచ్చే పురుషుల హిందీ రికార్డులలో నూటికి 90 అతనివి అవుతూ వుండడంవల్ల, పైనపేర్కొన్న అయిదుగురిరికార్డులు టేపుపైన, రేడియో గ్రామ్‌లలోనూ వింటూ, అతని కేకలూ, కూతలూ శ్రుతి గోచరం కాకుండా చూసుకుంటూ వుంటాను.

ఇది ఇలా వుండగా 'జ్యోతి'

రాగ రంజని

మా స పత్రికలో సైగల్, పంకజ్‌ల గురించివ్యాసాలు ప్రచురణ - కావ డంతో నా కొక ప్రత్యేక మైన ఆనందం కలిగింది -నాలాగే బెంగా లీ పద్ధతిలో నడి చిన ఫిలిం సంగీ తాన్ని మెచ్చు కునే వాళ్ళుతెలు గువారిలోఇంకా వున్నారని.



యస్. డి. బర్మన్

సరే, ఇంక అసలు విషయం లోకి దిగుతాను.

'మొదట గాయకునిగా ఎస్.డి. బర్మన్‌ని గురించి—

సుమారు ఇరవై సంవత్సరాల క్రితం రేడియోలో 'ధీరే సే జానా బగియన్ మేం' వినడం సంభవించింది.

'పంకజ్' వ్యాసంపై నేనుచేసిన వ్యాఖ్య ఫలితంగా నాకు మొట్ట మొదటిసారిగా ఒక బహుళ ప్రచా రంగల పత్రికద్వారా తెలుగు రచనలో అడుగు పెట్టడం సంభవిం చింది. ఆశ్చర్యం ఏమిటంటే నాకు ఇంగ్లీషులో జర్నలిజంలో ప్రవేశం కూడా ఒక తప్పుపట్టుకున్న (ఆ పేప రులో జర్మను మాట స్పెల్లింగ్ తప్పు పడింది. 'Telefon' అనవల సినది 'Telephon' అని) లేఖ వల్లనే కలిగింది.

అయితే తప్పు పట్టడం సులభం. తప్పు వ్రాయకుండా వుండడం కష్టం. అందుచేత పాఠకులు నా యీ వ్యాసంలో ఏవైనా తప్పులుంటే మన్నిస్తారని ఆశిస్తున్నాను.

ఈ నాటికి కూడా బర్మన్ ప్రైవేట్ రికార్డులలో దీనికే ఎక్కువ ప్రజాదరణ. ఈనాడైతే నాకు ఈ రికార్డు వెనకవైపున వున్న "కౌన్ నగరియా జావోరే" అనే భజన అంటే ఎక్కువ ఇష్టం.

అయితే "ధీరేసే జానా"లో సంగీతం, సాహిత్యం, స్వరం మూడూ సమంజసంగా సమ్మిళితమై, ఒక సహజమైన ధ్వనిని వినిపింపజేస్తూ ఆ పాటయొక్క భావాన్ని ("తోటలో నెమ్మదిగా నడు, తుమ్మెదా") శ్రోతకు ఒక విచిత్ర మైన రసానుభూతితో అందింప జేస్తాయి. కాని ఈ పాటలో కొంచెం గాంభీర్యం లోపిం చింది. 'కౌన్ నగరియా'లో

తాళ, మేళ సంకలనం మొదటి నుండి చివరదాకా ఒక నిర్దుష్టమైన మూర్ఛనలతో శాస్త్రీయ రాగాన్ని అనుసరించడం వల్ల, ఆ పాటలోని మాధ్వం, మాధుర్యం, ఉత్తరదేశీయ భజనలతో రాధా కృష్ణుల ప్రణయ గాథల నాధారం చేసుకున్న భావానికి, ఆధ్యాత్మికమైన ఆహ్లాదాన్ని చేకూరుస్తాయి. పైగా బర్మన్‌దాదా ఈ పాటలో తన రాగాన్ని ఒకే స్థాయిలో హాయిగా నడిపించాడు.

బర్మన్ యొక్క 'గైర్ ఫిల్మీ' పాటలలో నాకు బాగా ఎక్కువ ఇష్టమైన పాట 'ప్రేమ్‌కా పింజరా హెూ గయా సూనా' (ప్రేమ పంజరం శూన్య మయిపోయింది). ఇందులో సంచారి భావం, స్థాయీ భావం మిశ్రమై, శృంగార రసాన్ని కరుణరసంగా మారుస్తాయి. 'ధున్' లు అనబడే వివిధ రాగాలను ఆధారం చేసుకున్న 'థుమ్రీ' (Thumri) కు అధునాతన రూపం చేకూర్చి ఈ పాట పాడాడు గాయకుడు.

దీని తర్వాత మెచ్చుకోదగ్గ ప్రైవేట్ పాట 'మేరీ జోబన్ కే ఫుల్వారీ మేఁ' (నాయవ్వనపు పూదోటలో,ఇందులోబర్మన్ తనమామూలు శైలిని వుపయోగించాడు. అంతే 'బందినీ' సినీమాలో 'ఓరే మాఝీ' బాణీలో ఉచ్ఛ, హీన స్వరాలను బెంగాలీ 'వల్లీ గీత్' వరుసనుబట్టి నడిపించడం.

ఇక సినీమా పాటలలో నాకు ఎక్కువగా నచ్చిన బర్మన్ పాట అతని క్రొత్త పాట, 'గైడ్'లోని 'వహాఁ కౌన్‌హై తేరా ?' (అక్కడ నీవా రెవరున్నారు?). పురుషులలో సైగల్ ('దుఃఖ్ కే') తప్పిస్తే పాటలలో ఎవరూ నవ్వు ఒప్పించలేదు ఇంతవరకూ. కాని ఇందులోని బర్మన్ నవ్వు సహజంగా లేక పోయినా, పాటకు కావలసిన వ్యంగ్యాన్ని సమకూర్చిందనే చెప్పాలి. కాగా ఇంత వయస్సు వచ్చాక కూడా 'ఉడ్ గయా భఁవరా' పాటనాటి సుస్వరాన్ని నిలబెట్టుకున్నాడంటే ఆశ్చర్యకరమైన విషయమే.

పోతే ఎక్కువగా శ్రోతలను ఆకర్షించిన ఇతని సినిమా పాట బెంగాలీ శైలిలో పాడిన 'సుజాత' లోని 'సునో మేరే బంధూ'. కేవలం బెంగాలీయులకే కాకుండా, ఈ ధోరణి పాట ఇతర భారతీయులకు కూడా నచ్చిందంటే అందులో బర్మన్ ప్రకటించిన ఆలంకారిక నైపుణ్య ప్రభావమే.

ఇక సంగీత దర్శకునిగా ఈవాడు యాక్టివ్‌గా వున్నవారిలో బర్మన్ అద్వితీయుడని నా అభిప్రాయం. లోకులకు భిన్న రుచు లుండడం సహజమే కాని, ఇటు పాశ్చాత్యమైనట్టి Tin pan alley, polynesian తాళాలు, Jazz వక్రోక్తులూ దిగుమతి చేసుకుని, శాస్త్రీయ

హిందూస్థానీ సంప్రదాయాన్ని తరుచు అధునాతనం చేసుకుంటున్న హిందీ సినిమా సంగీతంలో తను ఏ విధమైన అనుకరణలకు లోను కావలసి వచ్చినా కూడా, తన భారతీయ, వంగీయ వైశిష్ట్యాన్ని ఎప్పుడూ విస్మరించకుండా సంగీతాన్ని రూపొందించింది (ఆర్. సి. బోరల్, పంకజ్ మల్లిక్, అరుణ్ కుమార్, కమల్‌దాస్ గుప్తా, అనిల్ బిశ్వాస్‌లు పూర్వులు.) ఈ నాడు బర్మన్ ఒక్కడే.

నాకు వ్యక్తిగతంగా బెంగాలీ భాష, సంస్కృతులపై వున్న అభిమానం నాకు పక్షపాతాన్ని కలుగజేసిందేమో చెప్పలేనుగాని, జయదేవ్, రవీంద్రనాథ్, అరవింద, జామినీ రాయ్‌లు బహుముఖ భారత కళా ప్రపంచంలో బెంగాలుకు అద్వితీయమైన స్థానాన్ని ఎలా ప్రాప్తింప జేశారో, బొంబాయి ఫిలిం మ్యూజిక్‌కు సచిన్ దేవ్ బర్మన్ అలా ఒక క్రొత్త గౌరవాన్ని తీసుకు వచ్చారని నొక్కి చెప్పగలను.

ప్రప్రథమంగా నాకు 1943 లో 'దో భాయీ' ద్వారా బర్మన్ సంగీతంతో పరిచయ మయింది. తనతోపాటు తన అనుభవాన్ని, ఆవేశాన్ని పాటల్లో ప్రతిబింబింప జేయగలిగిన గీతారాయ్ (వివాహమయ్యాక గీతాదత్)ని కూడా సినిమా సంగీత ప్రపంచానికి పరిచయం చేశాడు. నాటినుండి నేటి వరకూ తమ తమ కలలు కలలైన అభాగినులకు (అభాగ్యులకు కూడా) 'మేరా సుందర్ సపనా బీత్ గయా' విన్నప్పుడల్లా కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూనే వుంటాయి.

గీతాదత్ పాటలలోకి నాకు మిక్కిలి ఇష్టమైనది కీర్తిశేషుడు అరుణ్‌కుమార్ 'పరిణీత'లో కూర్చిన 'చాంద్ హై వహీ గగన్' అనుకోండి. అయితే మిగతా ఆమె పాటలలో నాకు ఎక్కువగా నచ్చిన వాటికి బర్మన్ దాదాయే సంగీత దర్శకుడు. కానన్‌దేవి (ఈమెను కూడా 1944 లోనే కలవటం తటస్థించింది నాకు)ని స్మరింపజేసే గీతాదత్ పాటలు 'ఆజ్ సజన్ మోహే' (ప్యాసా), 'న బదలే హమ్' (బాజీ), 'వక్త్ నే కియా' (కాగజ్ కే ఫూల్) మొదలైన వాటికి సంగీత దర్శకుడు బర్మనే.

ఇవే కాకుండా ఇతర గాయనీ గాయకుల చాలా గొప్ప పాటలకు కూడా బర్మనే సంగీతం కూర్చాడని నా అభిప్రాయం. ఉదాహరణకు: హేమంత్‌కుమార్ 'జానే వో కైసే' (ప్యాసా), ముహమ్మద్ రఫీ 'హమ్ బేఖుదీ మే' (కాలాపానీ), లతా మంగేష్కర్ 'ఘాయల్ హిరనియా' (మునీంజీ), తలత్ మహ

మ్మద్ 'జల్‌తేహై జిస్ కే లియే' (సుజాత)—వారు పాడిన పాటల్లోకి ఉత్తమమైనవి, బర్మన్‌చే సంగీతం కూర్చబడినవి.

పోతే పాశ్చాత్యులు తమ సింఫనీల మెలోడీ, హార్మొనీ, కౌంటర్ పాయింట్‌ల గమకం ఎలాగ నడిపిస్తారో అలాగ తన సంగీతం రూపొందించగలిగిన ప్రతిభ బర్మన్‌కు వుంది.

ఒక్కొక్కప్పుడు అర్హతనుబట్టి కాకుండా, అధిక సంఖ్యాకుల విఫలావేశాన్ని బట్టి కళాకారులకు ప్రజాదరణ లభిస్తుంది. బర్మన్ సంగీతం కూర్చిన సినిమాలలో ముఖ్యంగా 'టాక్సీ డ్రైవరు' లోనే అనుకరణ పద్ధతి ఎక్కువగా అవలంబించబడింది. కాని దీనికే అతనికి 'ఫిల్మ్ ఫేర్' అవార్డు లభించింది!

అది అలా వుంచితే, నయన శాస్త్రీయ రాగాలను ఘనంగా అనుసరించిన 'సితారోంసే ఆగే' లాంటి చిత్రానికి ప్రఖ్యాతి తగినంత కలుగలేదు. ఈనాడు కూడా ప్రజలు 'గైడ్' లోని 'గాతా రహే' మెచ్చుకున్నారు కాని, 'పియా తోసే' (శాస్త్రీయరాగం) అంతగా శ్లాఘించలేకపోతున్నారు.

బహుశా ఇది లోక సహజం. మెజారిటీకి, మైనారిటీకి నడుమ భేదం ఎప్పుడూ వుండేదే. ఈ రెంటినీ సమన్వయపరిచి, (ఇంచుమించు ఏకచ్ఛత్రాధిపత్యం వహిస్తున్న ఒక సన్నగొంతుక గాయకుణ్ణే కాకుండా) తరచు మన్నాడే (దేవ్), కిషోర్‌కుమార్‌ల వంటి గంభీర స్వరం గల గాయకులను కూడా ఆదరిస్తున్న బర్మన్‌దాదా కూడా మిక్కిలి గౌరవనీయుడు.

ప్రభుత్వంవారు వారికి బిరుదులు సమర్పించకపోవచ్చు. వీరిలాగే బెంగాల్‌లో కమల్‌దాస్ గుప్తా, బొంబాయిలో రామచంద్ర చితల్‌కర్, మద్రాసులో ఘంటసాల, రాజేశ్వరరావులూ, గాయక-సంగీత దర్శకులుగా పేరు పొంది వుండవచ్చు. కాని గాయకులుగా, సంగీత దర్శకులుగా సమానమైన ప్రతిష్ఠ పొందగలిగిన అర్హతవున్న వారు మన దేశంలో ఇంతవరకూ ఈ క్రింది నలుగురేనని మరొకసారి చెప్పదలచుకున్నాను: 1. పంకజ్ మల్లిక్ ['డాక్టర్' — 'అజ్ అపనీ'] 2. ఎస్. డి. బర్మన్ ['సుజాత', సునో మేరే బంధూ], 3. అరుణ్ కుమార్ ['మశాల్', 'జబ్ తుమ్ థే హమారే!'] 4. హేమంత్ కుమార్ ['శరిత'. 'నయహ్ చాంద్ హోగా!'].

—ఆర్. యమ్. చలా

□□□

కుప్పగా కూలింది వన్నెలి

జి. నరసింహారావు

ఆకాశంలో చుక్క పొడిచింది. రాచవారింట్లో చుక్క వెలిసింది. నిండు మనసుల మురిపెం తీరిందని సంబరాలు పోతున్న రాణిని చూసి వెన్నెల ఎగసిలేచింది.

చిన్నారి నవ్వులకు, సిరిమల్లె పూవులకు పోటీగా, ఒయ్యారి కులుకుల రాయంచ నడకలకుసాటిగా, రాచకులాన రాజనిమ్మపండు వన్నె కన్నె పిల్ల: గొల్లల దేవునికి మన సమ్మకున్న రాధమ్మ రాగంలా, అదేమి చోద్యమోగాని కొండ కిష్టయ్య సన్నిధి వదిలేదికాదు.

ఆడిన ఆటల్లో, పాడేపాటల్లో రాజగోపాలమూర్తి రాగాలకథలు లాస్యంచేసేవి. పెదవి చివరి విరుపుల్లో గోపాలస్వామి కొంటెదనం: కనులఆశ నాట్యంలో కాళియమర్దను లీలానృత్యం: ఆమె గోపాలుని మారురూపు, మరో రూపు అన్నట్లుండేది.

వెన్నెలలానే వయసు విచ్చుకుంటున్నకొద్దీ: రాచనగరులో రసిక రాజుల ఝుమాయింపెక్కువయింది. విల్లమ్ములు వదిలి, పిల్లగాళ్ళు చినదాని కనుసన్నల నాశ్రయించిన సమయాన; అందానికీ, చందానికీ, అమ్మడే ఆది పునాది యని వలపు గాళ్ళు ఊసుల తేలియాడుతున్న నిముసాన:


రాచనగరంతా గుప్పుమంది—

"సంగీతం, సాహిత్యం జంటగా నేర్చిన చినవాడిదే జవరాలు" అని.

మాటవిని మనసు మార్చుకున్న మారాజులు మలి సందికే యింటి మొహం పట్టిన వేళ: కళల తల్లి చల్లనిచూపుకు కరువులేని కోర్కెల పిల్లగాళ్ళు వంతుకోసం వేచియున్న వేళ: "మలయమారుతం"తో పాన్పు వీడి, పూలసెజ్జలాంటి పడుచుపిల్ల స్వామి వారిని చేరింది

కన్నుల్లో ఆశ, ఆవేశం, అనుతాపం రంగు లీనుతుండగా: ఓరకంట స్వామిని చూసింది. "దేవా! ఏమి నీ సెల" వంది.

చిర్నవ్వు నవ్వాడు గొల్లడు.
వల్లెయని పిల్లది కదిలింది. పైట
చెంగు రెపరెప మంది
పడుచుదనం పెళపెళమంది
"దేవుని సెలవైంది. జంటకోరే
బంటుల్ని ప్రవేశపెట్టు"మంది
"అహా!" యని వరాల మురిసి
బిరాన చనినారు చిన్నవాళ్లు.



వెన్నెలవేసిన ఉద్యానవనంలో, చుక్కలు సొగసుచూసుకునే సెలయేటి దాపున, అందాల లిల్లిపూల పందిరిలో: పన్నజాజి పరిమళం లాంటి చిన్నదుంది. ఆశగా చూసే చెలికత్తె చెంతనే ఉంది.

వాతావరణం వయసు పిల్ల వలపు పాటలా ఉంది

మీసాల రోషాలు ఎగసే, రాచవాడు ముందు వచ్చాడు. కళలకుతను నెలవని పౌరుషంగా పలికాడు. చిన్నదాని మాటల్ని చెలికత్తె తెలియ చేసింది.

గీతం పాడమంది.

గొంతెత్తాడు పాట ఆపి పొమ్మంది. 'ఆరాధన లేని మనసులో ఆనందంఉండదు. ఆనందం లోంచి పుట్టే గీతంకన్నా అన్యంనాదెపుడు వినలేదు. సరిగమలు సంగీతం కాదు. రసావిర్భాతికి నాంది పలకలేని నీ పాట పరిమళం లేని పువ్వులాంటిది. ఇక వెళ్ళవచ్చు' అంది.

మరొకడొచ్చాడు. మనసైన చినదాని మమత దోచుకునే దొంగను తాను కావాలని, దాసుడిలా, వినయం పిల్లి మొగ్గలు వేస్తూంటే వచ్చాడు.

కవనంఅల్లమంది. నోరు తెరిచాడు.

చాలుచాలంది. అందని ఆశకై ఆశెందుకంది. గొల్లల దేవుని లీలా పారాయణ చేయనోపని నీ బ్రతుకెందుకంది. యమునకు అందని ఆనందాన్ని అందించి అలరించగల నేర్పులేని కవికి కవనమెందుకంది. ఛందంకాదు, పదబంధంకాదు, రసగంధం కవిత్వమంది. 'గోపాలుని

వేణువులో గొంతు విచ్చుకున్న బృందావన రాగాలకు కవి గుండె నెలవు కావాలి. రాధమ్మవారి కనుల్లో రంగు తీర్చుకున్న కలలకు కవిత్వం ఆలయంకావాలి; లేనినాడు నీ కవిత్వమెందుకు, కాను కమ్ముకోనా!' అంది.

'సుందరమైన స్వప్నంలో సొబగుతీర్చుకుంటున్న భావాలు పూలవాకిళ్ళలో పిల్లగాలిలా నృత్యంచేసే రోజున కవిత్వం అమరత్వాన్ని సాధిస్తుంది చరాచర జగత్తులో సామూహికంగా సాగే రాగానురాగాల విపంచీ నినాదాలకు రూపం ఒద్దగల నేర్పున్న నాడు కవి దేవుడవుతాడు. ఆ సిద్ధిసాధించుకొని రమ్మంది. పొమ్మంది.

దివసాలు గడిచాయి. కోటలో సన్నాయి పాటకోసం జనం చెవులు తెచుకున్నారు. ప్రయోజనం లేక పోయింది.

ఒచ్చేవారొస్తున్నారు. చిన్నదాని ఊహల ఉయ్యాలలోకి ప్రవేశానికి అవకాశం మాత్రం దొరకడంలేదు.

రాచనగరంతా ఈ పరుష ప్రవర్తనకు చిన్నపుచ్చుకుంది.

తెలవారితే వసంతోత్సవానికి నాంది పాడతారు. నగరంతా అలికిడిగా ఆనందంగా ఉంది.

చుక్కలు హెచ్చుగా విచ్చుకున్న సమయాన, దూరంగా కొండల్లోంచి, ఏదో మధురనాదం, ప్రకృతి గుండెల్ని పులకరింపచేస్తూ, జాహ్నవిలా ప్రవహించి పోతూంది. ఆ గానానికి ఆద్యంతాలు, చావు పుట్టుకలు లేవులా ఉంది.

పిల్లగాలులు పాటను పడుచు గుండెలకు అందేలా చేస్తున్నవేళ: పట్టుపానుపుమీద పవళించిన పసిడి బొమ్మ మనసుచెవుల్లో ఎవరో గుసగుసలాడి నట్లయింది. ముద్దుల చప్పుళ్ళు, చిలిపి పలకరింపులు పడుచుపిల్ల వయసుకి తోచినాయి.

కలల లోకాల చిన్నది లేచింది.
చూసింది.
అంతఃపురంలో వెన్నెల తప్పించి
మరోటి నిదురమాని లేదు.
చెవులు రిక్కించింది. హృదయం
తెరచింది.
ఏదో పిలుపు రారమ్మని.
'ఏమా!' అని చూస్తే అంతా
వెన్నెలే!

'వెన్నెల వేళ వెదురు పొదల రొదకాదుకదా!' అనుకునేటంతలో: ఇంకా మోహనంగా: మంజులంగా: వలపుకత్తె గుండెలు ఝల్లుమన్నట్లు: తిరిగి ఏదో పిలుపు. కొమ్మగా: గోపాలదేవుని ఎంగిలి పెదాలంత!

వ్రజవనితల వయసు మురిపం లాంటి వెన్నెల మాత్రం నగ్నంగా.

తిరిగి 'రావూ! రావా! రాలేవు కదూ!' అన్నట్లుగా పలికే పాట.

నౌకాదళంలో కొత్తగా చేరిన వారికి ఈతలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో ఒక ముఖ్యమైన అంశం పదిహేను అడుగుల ఎత్తునుంచి నీళ్ళలోకి దూకడం.

ఒక యువకుడు తను అంత ఎత్తునుంచి దూకలేనన్నాడు.

అధికారి కోపంగా 'నువ్వు ఎక్కిన నౌక మునిగిపోతోందనుకో. నువ్వు పదిహేను అడుగుల ఎత్తున వున్నావనుకో. ఏం చేస్తావ్? అని అడిగాడు.

'నౌక ఇంకో పది అడుగులు మునిగేదాకా ఆగుతాను' అని సమాధాన మిచ్చాడు యువకుడు.

పాటకు పదాలు లేవు: రాగం ఉంది. రాగంలో రేగే భావం ఉంది.

ఆశగా చూస్తే: అంతా వన్నెల వెన్నెల. నీడ జాడలేదు.

"మనసులోని మధురమైన మనసు పిలుపు వినవా! వయసుకి గంధం పూయాల్సినవాడు: కొండల్లో కోనల్లో; సమాధిలో కూర్చుని సాగించే రాగరసవాహిని పడి రాలేవా? లోకాలకు ఎల్లలు కానీ కలల లోకాలకు కాదు! ఓ... మధుర ప్రణయినీ..ఆశల ఆకాశంలో అల్లినవెన్నెల కావ్యంలో 'కుహూ' అన్న భావంలాంటి ఓ సౌదామినీ! రాలేవా!" అన్నట్లుగా పలికేరాగం.

చిన్నదానికి ఊరటలేదాయె! "ఏల ఈ రేయి ఇంత వింత పిలుపుల నెరబోస్తూంది. ఏ దేవుడి చల్లని దీవెన, ఏ వలపుల గాలుల వీవన: ఈ రమ్మను కమ్మని తెమ్మెర పిలుపులు. ఏమాయిది?" అని చిన్నది రిచ్చపడి నిల్చుండిపోగా,

"మరీ అంత మోమోటమా! ఆకాశంలో చుక్కల నడుగు: వెన్నెలయేట్లో విరిసిన జాబిలి పువ్వు నడుగు. నవ్వేపెదవుల నడుగు. చల్లగాలిని అడుగు. పిల్ల ఆశను అడుగు. నేనెవరో చెబుతారు. మరో సారి మన కోసం రాని వెన్నెల ఊరిస్తుంటే ఊరుకుంటున్నావా? మరి రావా! కోర్కెల బాటల మీదుగా సాగిరా!... ఆశల వెలుతుర్లో, అందంలా ఆనందంలా:రా... రా..రా...

ఒకే రాగంలో కులికే పిలుపుకి గుండె ఒక దెసకు అడుగు వేస్తుంది. అయినా ఏదో బంధం వెనక్కు లాగుతూంది.

ఈసారి మరి తాళలేక పోయింది చిన్నారి. పరువంలో వీణలు పలుకుతున్నాయి. గుండెల్లో వసంతాలాడుకుంటున్నాయి వెన్నెలలు. గాలి తాకిడిచే విచ్చుకున్న పరిమళాలు వయసు మనసుని తొందర పెడుతున్నాయి.

అడుగు ముందుకు వేసింది. ఆగి పోయింది.

రావు కదూ! నీ ఆశతో నా యీ జీవన దీపం వెలిగించవు కదూ! స్వాప్నికంగా సాగే యీ గానం దెసకు పరుగు తీయవు కదూ! ఇక్కడ వెన్నెల లేదు.. వేడి లేదు... ఊపిరిలేదు... ఉత్సాహంలేదు. ఉన్నదంతా తర తరాల అనురాగాల ప్రవాహం.

ఇక్కడ ఆవేదనలేదు: ఆవేశం లేదు...

ఉన్నదంతా జీవనరాగ తరంగాల మీద నీతో ఉయ్యాలూగాల్సిన నేను మాత్రమే... ఇక్కడ శరీరంఉండదు– స్వార్థం ఉండదు.

ఉండేదంతా... ఒకే ఒక జంట మనసు మమత మాధురి... రాఁ... రాఁ... రాఁ...'

ఆశలా, ఆవేశంలా పరుగులు తీసింది ఒయ్యారి. పాట జగమంతా పున్నాగపరిమళంలా నిండిపోతూంది.

పరుగుతీస్తూనే ఉంది ఒయ్యారి. గుండెలు నిదురవిడి ఊగిపోయేటట్లు మరీ మరీ మధురంగా: అర్థంకాని సందేహాన్నందించే ఆ పాట: సాగి పోతూనే ఉంది.

చుక్కల లోకాల దెసకు, చిక్కని రాగాల బసకు, పరుగులుసాగిస్తూనే ఉంది మిటారి...

తెల తెల వారుతూంది.

వేకువ కాంతుల్లో ఊరవతల నదిలో. వెన్నెల కుప్పగా కూలి పోయి, మునిగిపోయి: చిక్కని బంగారు కిరణమై నింగి కెగిరి పోయింది.

□□□

మీ వయస్సు ఎంతో చెప్పనా?

నలభై ఏళ్ళు దాటిన ప్రతివాడు **దగుల్బాజీ** యేనని బెర్నార్డ్‌షా అన్నాడు. (Every man over forty is a scoundrel.)

ఈ ముక్క అనేసరికి ఆయనకి నలభై దాటాయి. కనక ఆయన మాటకి మనం విలువ ఇవ్వనక్కర లేదు.

కాని, మొత్తమ్మీద నలభై ఏళ్ళ వయస్సు ప్రతివాడి జీవితంలోను ఒక ముఖ్యమైన ఘట్టమని నిరాఘాటంగా చెప్పవచ్చు. అసలు జీవితంలో వయస్సుకి సంబంధించినంత వరకు రెండే ముఖ్యమైన ఘట్టాలున్నాయని చెప్పవచ్చు. ఒకటి పదిహేనేళ్ళ వయస్సు. రెండోది నలభై ఏళ్ళ వయస్సు.

వ్యక్తిని ఈ రెండు వయస్సులూ చెడ్డ ఇబ్బంది పెట్టేస్తాయి. ఉన్న వాళ్ళం ఉన్నట్టుండక ఆ వయస్సుల్లోకి ఎందు కొచ్చామా అని ఊ ఇదైపోతారు. వాటిలోంచి ఎంత దబ్బున బయట పడదామా అనిపిస్తుంది. పదిహేనేళ్ళ వాడికి చప్పున ఇరవై వచ్చేస్తే బావుండునని వుంటుంది నలభై ఏళ్ళ వాడికి మళ్ళీ ముప్ఫయిలోకి పోవాలనిపిస్తుంది.

పదిహేనేళ్ళవాడు ఇటు కుర్రాడూ కాదు, అటు పెద్దాడూ కాదు. వాడు చిన్న పిల్లల్లో కలవ లేదు. వాళ్ళ ఆటల మీద వాడికి ఆసక్తి వుండదు. పెద్దవాళ్ళతో కలుద్దామని వుంటుందిగాని, వాళ్ళు కలవ నివ్వరు. "ఒరేయ్! నువ్వు కుర్రాడివి. మా మాటలు విన కూడదు. ఫో!" అంటారు.

ఆ వయస్సులో కుర్రాడు పొడుగెదిగిపోవడం మొదలెడతాడు. కొందరు ఈడుకి మించి గడకర్రల్లా సాగుతారు. గొంతుక మారిపోతుంది. మూతిమీద మీసాలు రావడం, గడ్డంమీద నాలుగైదు పొడుగాటి వెంట్రుకలు రావడం మొదలవుతుంది. వాటిని దాచుకోటానికి మహా ఇబ్బంది పడిపోతాడు.

అలాగే, నలభై ఏళ్ళవాడికి, వాడి ఇబ్బంది వాడికి వుంటుంది.

కె.వి. రామచంద్రమూర్తి

జుట్టు, గడ్డం, మీసాలు నెరవడం ప్రారంభిస్తాయి. కొద్దిగా ముసలి వాలకం పడుతుంది. పెద్ద సంతానం కొడుకు అయితే దాదాపు తనంత ఎదిగిపోతాడు. నెరిసిన వెంట్రుకల్ని, పెద్ద కొడుకునీ ఎక్కడన్నా దాచెయ్యాలని అనిపిస్తూ వుంటుంది.

పెద్ద సంతానం ఆడపిల్ల అయితే పెళ్ళీడు కొస్తుంది. పెళ్ళి చేయక పోతే ఆ పిల్ల "అగ్గిదొర", "కంచుకోట"లాంటి సినిమాలు చూసేస్తూ గుండెలమీద కుంపటిలా వుంటుంది. పెళ్ళి చేసేస్తే తను అప్పుడే మామగారై పోతాడు. పెళ్ళి అయిన ఏడాదికే తాతగారు కూడా అయి పోతాడు.

ఎదర అంతా సహారా ఎడారిలా వుంటుంది. జీవితంలో అనుభవించ దగినఆనందాలు ఇంకేమున్నా యని పిస్తుంది. ఉన్నా, అనుభవించ దగిన వయస్సు దాటిపోయినట్టు, అన్నీ ఉడిగిపోయినట్టు అనిపిస్తుంది. వెనక్కి చూసుకుంటే ఒకటీ అరా సువర్ణ ఘట్టాలు కనబడతాయిగాని, ఎన్నో అలాంటి వాటిని తను చేజేతులా వదులుకున్నందుకు మనిషి ఇదే పనిగా నాలిక్కరి చేసుకుంటూ వుంటాడు.

ఎక్కడ చూసినా తన కంటె చిన్నవాళ్ళ జనాభా ఎక్కువగా వున్నట్టు కనబడితే బలే బాధగా వుంటుంది. వాళ్ళ సరదాల్లో తను పాల్గొనాలని వుంటుంది. వాళ్ళు తమతో కలవనివ్వరు. అందాకా తుళ్ళుతూ, పేలుతూ కబుర్లు చెప్పుకుంటున్న కుర్రసజ్జు తను దగ్గిరికి రాగానే గంభీరంగా మారిపోతారు. "మా కుర్రాళ్ళ కబుర్లు మీకెందుకు లెద్దురూ!" అనేస్తారు.

ఈడొచ్చిన ఆడపిల్లలు తనను తండ్రిని చూసినట్టు గౌరవంగా చూస్తారు. వాళ్ళకి కాస్తయినా ఖాతరుండదు. పెళ్ళాం కూడా ముప్ఫయి అయిదేళ్ళకే ముసలిదై పోయినట్లు వుంటుంది. ఆమెనిచూసి తనకు యాభయ్యేళ్ళుండవా అని జనం అనుమానిస్తారు. పెద్దన్నగారి మనమళ్ళూ వాళ్ళూ తన్ను తాతయ్యా అని పిలిచినప్పుడల్లా వొళ్ళు మండుకు పోతుంది. క్రమంగా జీవితంలో సరదా చచ్చి పోతుంది; విరక్తి పుడుతుంది.

నాకు తెలిసిన కవిగారొకాయన వుండేవారు. ఆయన సౌందర్యారాధకుడు. అజ్ఞాత ప్రేయసిమీద భావగీతాలు దస్తాల కొద్దీ రాశాడు. ఎప్పుడూ అప్పుడే విచ్చిన మల్లెపువ్వులా కనపడాలని మహా ఇదైపోయేవాడు. ఆయన తనకి నలభైయ్యో ఏడు రాకుండా చేయటానికి చాలాకాలం — రెండు మూడేళ్ళకు పైగా — ప్రయత్నం చేశాడు. ఎప్పుడు అడిగినా "ఏదీ,

...గాని, ఇంకా 39 రాలేదోయ్' అనేవాడు. 37–38–39–ఇలా రకరకాలుగా ఒక్కొక్కళ్ళ దగ్గర ఒక్కొక్క వయస్సు చెప్పేవాడు.

ఒకసారి మా కుర్రాళ్ళమంతా కలిసి ఆయన్ని నిలదీసి అడిగేశాం: 'మేష్టారూ! మీకు ఇంతకీ 39 వచ్చినట్టా, రానట్టా?' అని. ఆయన నవ్వేసి తనకి 40 దాటి 42 కూడా వచ్చినట్టు నిజం ఒప్పేసుకున్నాడు. కాని, కొత్త వాళ్ళ దగ్గర 39 అనే అబద్ధం చెప్పేవాడు.

ఆయనకి ఇంకో సరదా వుండేది. తనకంటే బాగా కుర్రాళ్ళని పట్టుకుని 'ఏమోయ్! నీకు 35 దాటాయా?' అనేవాడు.

'లేదండీ, ఇంకా 25 నడుస్తోందండీ!' అని ఆ కుర్రాడు అంటే 'ఇంతేనా?' అని ఆయన ఆశ్చర్యపోయేవాడు. వీలైనంత మందిని దగ్గర దగ్గర తన ఈడు వాళ్ళలా ఊహించుకుంటే ఆయన కదో సంతృప్తి.

నిజానికి కొందరు 30 ఏళ్ళకే 40 దాటిన వాళ్ళలా కనిపిస్తారు.


కొందరు 40 దాటినా 30 ఏళ్ళ వాళ్ళలా కనిపిస్తారు.

ఎవరితోనన్నా మనకు పనిబడి, వాళ్ళని మంచి చేసుకోవాలంటే ఒక సులభమార్గం—'మేష్టారూ! మీరు నలభై ఏళ్ళున్నట్టు కనిపించరండీ! ఓ పదేళ్ళు తక్కువ వున్నట్టుంటారు!' అనాలి. దాంతో ఆయన పైకి సబడకుండా లోలోపల పొంగిపోతాడు. మనకి గులామైపోతాడు. మన పని అవుతుంది.

అయితే, ఆ పెద్దమనిషి వయస్సు నిజంగా నలభై అవునో కాదో ఘట్టిగా తెలుసుకుని మరీ ఈ అస్త్రం ప్రయోగించాలి. అవతలి వాడి వయస్సు నిజంగా పదేళ్ళు తక్కువే అయి వుండి, పదేళ్ళు ఎక్కువలా కనిపిస్తున్నప్పుడు ఈ చిట్కా వేశామా అంటే ఆయన అగ్గిరుద్రుడై పోతాడు. 'నాకు నిజంగా పదేళ్ళు తక్కువేనోయ్ ... వస్తా...' అని మన్ని దులిపేసుకుని వెళ్ళిపోతాడు. మన పని చెడుతుంది.

అంచేత ఎవరినన్నా శత్రువు చేసుకోవాలనుకున్నప్పుడు 'మీకు నిజంగా నలభై ఏళ్ళయినా యాభై ఏళ్ళవారిలా వుంటారండీ!' అనండి. ఆ మనిషి జీవితాంతం మిమ్మల్ని క్షమించడు.

వాళ్ళ వాళ్ళ వృత్తుల్నిబట్టి మనుషులు అసలు వయస్సుకి మించి కనిపిస్తారేమోనని నాకో అనుమానం. త్వరగా ముసలి వాళ్ళలా అయిపోయేవాళ్ళలో హైస్కూలు ఉపాధ్యాయులు ముఖ్యులు. వీళ్ళు ఎప్పుడూ తమకంటె చిన్నవాళ్ళతో కలిసి వుండడంవల్ల పెద్ద వాళ్ళుగా కనిపించటానికి అప్రయత్నంగా



ప్రయత్నం చేస్తూవుంటారు. లేకపోతే కుర్రాళ్ళు కుర్రాడి కింద కట్టేస్తారని భయం. అంచేత పంచె కట్టి, దొక్కా లోపల దోపి, కోటు వేసి, ఓలునిబట్టి తలపాగా ధరించి వస్తారు. ఈ వేషంలో 30 ఏళ్ళ వాడైనా 40 దాటినట్టు కనబడక మానడు. అలాగే డాక్టర్లు కూడా. మరీ కుర్రాడిలా కనిపిస్తే అనుభవం లేని వాడనుకుని ఎవరూ రారు. అలాగే లాయర్లు కూడాను.

కాని, ఎన్నాళ్ళకీ వృద్ధాప్యం రానట్టుండే రెండు ముఖ్యమైన వర్గాలున్నాయి. ఒకరు రాజకీయ వేత్తలు. నెహ్రూగారు చాలా ఏళ్ళపాటు ఓపదేళ్ళు తక్కువ వయస్సు వాడులా కనబడేవారు. తెన్నేటి విశ్వనాధంగార్ని చూడండి. ఆయనకి 70 ఏళ్ళు దాటాయంటే ఎవరూ నమ్మరు.

అసలు రాజకీయవేత్తలు ఎందుకో గాని సాధారణంగా దీర్ఘాయుష్కులై వుంటారు. చర్చిల్, అట్లీ, అడెనోవర్‌లాంటి వాళ్ళు ఎన్నేళ్ళు బ్రతికారో చూడండి. మనదేశంలో రాజకీయవేత్తలు కూడా అంతే. అసలు ఈ వర్గంలోనే అకాల మరణాలు తక్కువ. నిర్యాణాలూ, అస్తమయాలూ, కాలధర్మాలూ మాత్రమే వాళ్ళకి వస్తాయి.

ఇంకో వర్గం సినిమా తారలు.

ముఖ్యంగా హాలీవుడ్ తారలు. వీళ్ళు వయస్సుని, వృద్ధాప్యాన్నీ జయించారా అనిపిస్తుంది. ఈ మధ్య ఏదో పత్రికలో మార్లీన్ డీట్రిచ్ ఫొటో చూశాను. అరవై నాలుగేళ్ళ వయస్సులో ఆమె ముప్ఫయి నాలుగేళ్ళ దానిలా వుంది. హాలీవుడ్ తారలు వయస్సు వస్తున్నకొద్దీ చిన్నవాళ్ళలా వుంటారని ప్రతీతి. (ఉండి తీరాలి మరి). మేరిలిన్ మన్రోకి చనిపోయేనాటికి 36 ఏళ్లు. ఇరవయ్యేళ్ళ దానిలా వుండేది. వివియన్ లీ 54 వ ఏట చనిపోయింది. 30 ఏళ్ళున్నట్టు వుండేది. మగతారలైనా అంతే. వీళ్ళంతా ఆస్కార్ వైల్డు నవలలో 'డోరియన్ గ్రే' లాగ వయస్సు రాకుండా వరం ఏదైనా పొందారా అనిపిస్తుంది.

అయినా, వాళ్ళ సంగతి మనకెందుకుగాని, మన సంగతి ఆలోచిస్తే నలభయ్యో ఏడు చాలా గడ్డు వయస్సు. పైన ఒకచోట నేను చెప్పినట్టు—ఎదర అంతా సహారా ఎడారిలా వుంటుంది. జీవితం ముప్పాతిక మూడు పాళ్ళు ముగిసిపోయినట్టు వుంటుంది (స్వాతంత్ర్యం వచ్చాక మన సగటు ఆయుర్దాయం 50కి పెరిగిందిట). పరంజ్ఞా చేసుకో దగిందేతప్ప, ఎదురు చూడదగిందేమీ వుండదు. అందుకే సాధారణంగా వాళ్ళ డైలాగు వెనకటి వాటితో నిండిపోయి వుంటుంది.

"ఒకసారేం జరిగిందో తెలుసా? అప్పటికి నాకు ఇరవై ఏళ్ళు. మీరు ఇంకా పుట్టారో లేదో?..' అని సొద మొదలుపెడతారు. ఈ సొదని బట్టే మనిషి వయస్సు కనిపెట్టవచ్చు. నలభైలోపు వాళ్ళెవళ్లూ ఇలా మాట్లాడరు. నలభై దాటినవాళ్ళే గత స్మృతులను తవ్వితీసి కథ మీద కథ-జరిగినా జరక్కపోయినా — సొదగా చెబుతూ పోతారు.

నలభయ్యో ఏటిని గురించి ఇంత ఇదిగా రాస్తున్నానంటే ఇదంతా నా సొంత పైత్యం అనుకునేరు. మన పూర్వులు కూడా దేవతల్ని 'త్రిదశులు'గా ఊహించుకున్నారు. దేవతలు తమకు ఎప్పటికీ 30 ఏళ్ళు దాటకుండా ఏర్పాటు చేసుకున్నార్ట. ముప్ఫయ్యేళ్ళ వారంతా దేవతలు కాకపోయినా, నాకు వాళ్ళని చూస్తే ఎందుకో అసూయగానే వుంటుంది. ఎందుకో ఏమిటిలెండి...

□□□

గోమతి

ద్వివేదుల విశాలాక్షి

(గత సంచిక తరువాయి)

11

ఆదివారం నాడు ప్లీడరుగారి పెరట్లో కాయలు కోయక పోతే ఇంక ఎలా గడపాలో గోమతికి, గోవిందుకి తెలియ రాలేదు.

"పోనీ రాణా కచేరీలోకి పోయి పువ్వులు కోసుకుందాం" అంది గోమతి. గోవిందు ఆ ఆలోచన బాగుంది అంటూ తల ఊపేడు.

"అలా మన బడి వైపు తిరిగి వద్దాం రాబావా" అంటూ గోమతి దారి తీసింది.

ముగ్గురూ రోడ్డు దుమ్మంతా ఒంటి మీదికి దిమ్ముకొంటూ పరుగులు తీసేరు. బడికి అటుపక్కగా చిన్న చెరువు ఉంది. ఒడ్డున కూర్చుని ఆ చెరువులో చేపల్ని చూస్తూ కాస్త సేపు కాలక్షేపం చేసేరు. రోడ్డు మరమ్మత్తు కోసం పోసిన కంకర రాళ్ళని సాధ్యమైనన్ని చెరువులోకి సరఫరా చేసేరు. చేతికి అంటుకోకుండా తారు ముద్దలు తీసి గచ్చకాయ లంతేసి ఉండలు చేసేరు. వాటిని భద్రంగా తీసుకుపోయి రాణా కచేరీ గేటు గడియ మీద పెట్టేరు.

"ఈరోజు అయితే ఎండ లేదు కాని, రేపు ఇదంతా కరిగి గడియకి అంటుకొంటుంది. ఆ పెంటయ్య తలుపులేస్తుంటే వాడి చేతినిండా అంటుకొంటుంది. వెధవకి అంతే కావాలి. లేకపోతే మేము సంపెంగ పువ్వులు కోసుకొంటే వాడికేం పోయింది. మళ్ళీ అన్నీ వాడిపోయి నేలమీద పడిపోతునే ఉంటాయి కదా. ముళ్ళకంచెతో వెంటతరిమేడు వెధవ. ఈరోజు భయం లేదులే. ఆదివారం కదూ. ఆఫీసుండదు. గేటుకి

సీరియల్

తాళం వేసి లోపల ఎక్కడో నిద్ర పోతుంటాడు. మనం ఆ ప్రక్క తోపుడుగేటులోంచి వెళ్లి కోసుకు రావచ్చు" అంది గోమతి.

"నువ్వు అన్నీ ఇలాంటి పనులు ఎందుకు చేస్తావు గోమతీ? నీకు పువ్వులు కావాలంటే మీ అమ్మ కొని పెట్టదా?" అన్నాడు గోపాలం.

"అది కాదు బావా! ఆఫీసులో అంతా మొగాళ్ళే ఉంటారుకదా. మరి ఆ పువ్వులేం చేసుకొంటారు చెప్పు. నేను కోసుకోకపోతే పాపం ఆ పువ్వులన్నీ అలాగే వాడి నేల మీద పడిపోతాయి. నాకెంతో జాలేస్తుంది వాటిని చూస్తే. మరేమో బావా! బజారులో అకు సంపెంగపువ్వులు అమ్మరు తెలుసా" అంది గోమతి తన పనిని సమర్థించుకొంటూ.

ముగ్గురూ కలిసి తోటలోకి జొరబడ్డారు. సంపెంగ చెట్టు ఇంకా పెరిగి పెద్దవి కాలేదు. అయినా అక్కడక్కడ పువ్వులు వాసనలు వెదజల్లుతూ గుత్తులు గుత్తులుగా ఉన్నాయి.

"నాకు ఆ గుత్తి కోసి పెడ్తావా బావా" అంది గోమతి ఒకదానిని చూపిస్తూ.

"ఇదిగో గోమతి! ఈ చెట్టుకి ఇంకా మంచిపువ్వులు ఉన్నాయి. ఇలా రా" గోవిందు మరి కాస్త ముందుకి వెళ్ళేడు.

గోపాలం సంపెంగచెట్టు వంక చూసేడు. చెట్టు ఎక్కితే విరిగి పడేలా వుంది. దరిదాపుల్లో కర్ర లాంటిది ఏదీ లేదు. క్షణకాలం ఆలోచించి చెట్టు మొదలు పట్టుకొని అటు, ఇటు ఊపేడు. బాగా

జరిగిన కథ

గోమతి ఒకనాటిరాత్రి తన బాల్యాన్ని నెమరువేసుకుంటోంది. అప్పటికి ఆమెకి ఏడేళ్లు. బాగా అల్లరి చేసేది. రంగమ్మగారి కొడుకు గోవిందు ఆమె నేస్తం. అతని తప్పు తనమీద వేసుకుని ఆమె క్లాసులో దెబ్బలు తినేది. గోవిందుకు ఆమె ఎంత చెబితే అంత. ఆమెకోసం ఏ పని అయినా చేసేవాడు. వారిద్దరి అల్లరికి ఊరూ వాడా ఏకమయ్యేది, ఇలా వుండగా గోమతి తండ్రి రామనాథం ఒకనాడు ఒక కుర్రవాడిని ఇంటికి తీసుకు వచ్చాడు. వాడి పేరు గోపాలం. ఇద్దరికి ముగ్గురు కావడంతో వారి అల్లరికి అంతు లేదు.



విచ్చిన పచ్చని సంపెంగపూలు తొడిమలు వూడి నేల రాలాయి.

'ఏరుకో గోమతీ! ఎన్ని పూలో!' అంటూ ఉత్సాహంగా చెట్టుని ఆడించేడు గోపాలం.

'ఈ పువ్వులు నాకొద్దు' గోమతి ముడుచుకొంది.

"ఏమయింది? ఇంతా చేతులు నొప్పి పుట్టేలా వూపితే ఎందుకు వద్దంటావు?' తన శ్రమని గ్రహిం

చని గోమతివంక కోపంగా చూస్తూ అన్నాడు గోపాలం.

"బుగ్గిలో పడిపోయిన పువ్వులు ఎవరికి కావాలేం" గోమతి మూతి బిగిస్తూ అంది.

తను కోసిన పువ్వుల్ని గోమతి నిరాకరించడంతో గోపాలానికి కోపం వచ్చింది. "నేలపడ్డ పువ్వులు కాకపోతే నీకోసం చెట్టు ఎక్కి కాలు విరుచుకోమంటావా? నీకోతిముఖానికి ఈ పువ్వులు చాలులే" అన్నాడు అక్కసుగా.

గోమతిని అప్పటి వరకు కోతి ముఖం అంటూ నిరసించిన వారు లేరు. అంతా కోతిపిల్ల అందచందాల్ని పొగడేవారే. బంగారవు బొమ్మ అంటూ చూసి ముచ్చటపడేవారే. గోపాలం కోపంలో కోతి ముఖం అన్నాడు. ఆ మాటతో గోమతికి దుఃఖం ముంచుకొచ్చింది. గోవిందు ఉన్నచోటికి ఏడుస్తూ పరుగు తీసింది.

గోవిందు పక్కగా ఉన్న మొండి గోడ ఎక్కి పువ్వులు కోసేందుకు తంటాలు పడుతున్నాడు. ఏడుస్తూ వచ్చిన గోమతిని చూస్తూ గోడ దిగివచ్చి "ఏమయింది?" అన్నాడు ఆత్రంగా.

"ఛీ... ఛీ... ఆ బావజట్టు నేను ఉండనే ఉండను. అమ్మ చెప్పినా ఉండను" అంది గోమతి కోపంగా.

"ఏమయింది?" తిరిగి ప్రశ్నించేడు గోవిందు. గోపాలం మీద గోమతికి కోపం రావడం గోవిందుకి సంతోషంగా ఉంది. దానిని పైకి కనపరచకుండా ఆ పిల్ల జుట్టుని సవరిస్తూ "చెప్పు గోమతీ" అన్నాడు బుజ్జగిస్తూ.

"నాది కోతి ముఖమట. నాకు బుగ్గిలో పడ్డ పువ్వులే చాలుట" అంది గోమతి ఏడుపు దిగమింగుకొంటూ.

గోమతిది కోతిముఖం అంటాడా? తను అంతకన్న అందంగా ఉన్నాడా? గోవిందుకి గోపాలం మీద ఎక్కడలేని కోపం ముంచుకొచ్చింది. ఎదురుగా ఉంటే చాచి లెంపకాయ కొట్టాలనిపించింది. ఆవేశాన్ని అపుకొంటూ "పో నీ లే గోమతీ. వాడిని పువ్వులు కొయ్యమని ఎందుకు అడిగేవు? నేను కోస్తి పెడ్తాగా" అన్నాడు ఆ పిల్లని ఓదారుస్తూ.

"రేపటి నుంచి ఆ బావని ఆటలకి పిలవనే వద్దు. బడికి కూడా మనిద్దరమే జతగా వెళ్దాం."

12

గోపాలం మెల్లగా అక్కడికి వచ్చేడు. ఎత్తి పట్టుకొన్న లాల్చీ కొసలో అరవిచ్చిన ఆకుసంపెంగలు ఉన్నాయి. "ఇవిగో గోమతీ! పువ్వులు తెచ్చేను" అన్నాడు.

'ఆ బుగ్గిలోపడ్డపువ్వులునాకుఅక్కర లేదు అసలు నువ్వేం కోసి పెట్ట వక్కరలేదులే. గోవిందు నాకెన్నో పువ్వులు కోసి ఇస్తానన్నాడు' అంది గోమతి ఆ పువ్వులవైపు చూపు తిప్ప కుండానే.

'ఇవి నేలనుపడ్డ పువ్వులుకావు గోమతీ! నీ కోసం చెట్టు ఎక్కి కోసేను'.తీసుకోవా అన్నట్లు ముఖం పెడ్తూ అన్నాడు గోపాలం.

'అబద్ధం గోమతీ! బుగ్గిలోపడ్డ వాటినే ఏరిగి తెచ్చి ఉంటాడు' గోవిందు మెల్లగా గోమతికే విని పించేలా అన్నాడు.

'చెట్టు ఎక్కి పువ్వులు కోస్తుంటే కొమ్మ విరిగి పడింది ...'

"ఆ" అంటూ అదిరిపడి చూసింది గోమతి.

'ఇదిగో కావాలంటే చూడు ఈ కాలంతా ఎలా చెక్కుకు పోయిందో, రక్తం కూడా వస్తు న్నాది!'

గోమతి గోవిందు చెయ్యి వదలి ఒక్కసారిగా గోపాలం దగ్గరికి పరుగు తీసింది.

'అమ్మో ఎంత దెబ్బ తగిలిందో. నొప్పెడుతున్నాదా బావా' అంది దిగులుతో.

అవును – అన్నట్టు తల ఊపేడుగోపాలం. గోమతి ఆత్రంగా ఇటు అటు చూసింది. ఆ దెబ్బకి ఏం చెయ్యాలో ఆ పిల్లకి పాలు పోలేదు. ఏదో ఒకటి చెయ్యాలని మనసు పీకింది. చేతిలోకి ఇంతఉమ్మి తీసుకొని దెబ్బ తగిలినచోట అంటించింది. నేల మీదికి వంగి

మేష్టారికి కొంచెం మతిమరుపు. గొడుగు ఎక్కడో మరిచి పోయారు. కాఫీ హొటల్లో అడిగారు, స్కూల్లో అడిగారు. పోస్టా ఫీసులో అడిగారు. బియ్యంకొట్లో అడిగారు. ఇంకా ఆవేళ తాను ఎక్కడెక్కడికి వెళ్ళిందీ గుర్తు చేసుకుని అన్ని చోట్లా వాకబు చేశారు. చివరికి ఒక కిళ్ళీ కొట్లో ఆయన గొడుగు ఆయన! దొరికింది.

కొట్టువాడితో 'ఇదిగో అబ్బాయ్! నువ్వొక్కడివే నిజాయితీ మనిషిలా వున్నావ్. ఎవర్నడిగినా మేము తియ్యలేదంటే మేము తియ్యలేదనేమాట. తీశానని ఒప్పుకున్నవాడివి నువ్వొక్కడివే కని పిస్తున్నావ్' అని మేష్టారు చక్కాపోయారు.

ఇంత బుగ్గి తీసి దాని మీద పట్టించింది

'ఇంక మానిపోతుంది బావా! ఆటల్లోనా కెప్పుడు దెబ్బలు తగిలినా ఇంతే చేస్తాను' అంటూ ఓదార్చింది.

'ఇంటికి పోదాం రా బావా' అంది గోమతి. గోపాలం చెయ్యి పట్టుకొని అతి జాగ్రత్తగా నడిపిస్తున్నట్లు తనతో తీసుకుపోయింది. గోవిందు దిగులుగా ముఖం వాల్చుకొని వారిని అనుసరించేడు.

అంత హంగామా చేసి కోయించుకొన్న సంపెంగపూల సంగతే మరచిపోయింది గోమతి. ఆమె మనసంతా గోపాలం దెబ్బమీద, అతడు పడుతున్న బాధమీద ఉంది.


'బాగా నొప్పెడుతున్నాదా బావా! ఇంకా కొంచెమైనా తగ్గలేదా' అని దారిపొడుగునా అడుగుతూనే ఉంది గోమతి.

ఇంటి గుమ్మం ఎక్కుతుంటే గోమతి మనసులో భయం రేగింది. తన పువ్వుల కోసం బావ చెట్టు ఎక్కి పడ్డాడంటే అమ్మ కోప్పడుతుంది. తన్ను తిడుతుంది – అనుకొంది.

'బావా అమ్మతో నేను పువ్వులు కొయ్యమన్నానని చెప్తావా ?' అంది దీనంగా ముఖం పెట్టి.

'ఊహూ చెప్పను. పరిగెడుతూ పడిపోయానంటాను' గోమతి వైపు చూస్తూ అన్నాడు గోపాలం.

గోమతి అతనివైపు ఆప్యాయంగా చూసింది. అలా చూస్తున్నప్పుడు గోమతి కళ్ళు ఎంతో బాగుంటాయి అనుకొన్నాడు గోపాలం.



13

వారి ముగ్గురి స్నేహం ముప్పేట గొలుసులా పెనవేసుకొని మూడు పువ్వులు, ఆరుకాయలుగా ఆరేళ్ళ పాటు ఆనందంగా సాగిపోయింది. ఆ సంవత్సరం ఉగాదికి ఆ స్నేహ వల్లరిలో అంతకాలం అంతర్గతంగా



మేళవిస్తున్న కమ్మని గానం ఏదో గోమతి విన్నాది. ఆ గాన మాధుర్యానికి ఆమె మనసు పల్లవించింది. ఒడలు పులకరించింది. జలధరాన్ని చూసి తన్మయత్వంలో పురివిప్పి ఆడిన నెమలిలాగా, ఆమెలోని అందం అణుక్షణువునా వికసించింది. బ్రతుకులో ఏదో తీయదనం పెదవులను తాకినట్లు అయింది.

ఈ అనుభవం ఇంత కమ్మగా ఉంటుందా? ఈ ఆలోచనలు ఇంత మత్తుగా ఉంటాయా? అనుకొంది గోమతి

సంవత్సరాది పండక్కి ఇంట్లో అందరికి కొత్తబట్టలు తెచ్చేడు రామనాథం. కుట్టుపనివాడి దగ్గిర నుంచి వచ్చిన పరికిణీ, జాకెట్టుతో పాటు ఇంకో రెండు గజాల బట్ట కూడా ఉండడం చూసి, "ఇది దేనికమ్మా" అంది గోమతి.

నవవికసిత కుసుమంలా అందాలు దిద్దుకొంటున్న కూతుర్ని చూసి, "పెద్దదాని వవుతున్నావు. ఇంక వల్లెవాటు వేసుకోవాలమ్మా" అంది ఆప్యాయంగా సావిత్రి.

ఆమాట ఎందుకో గోమతికి సిగ్గనిపించింది. ఆక్షణంలో తల్లి అన్న ఆ పెద్దతనం తన ఒడలంతటా ఉరుకులు, పరుగులుగా ప్రవహిస్తున్నట్లు అనిపించింది

పల్చని వాయిలు వోణీని భుజం మీదుగా వేసుకొని అద్దంలో తన ప్రతిబింబం చూసుకొన్నప్పుడు ఏదో కొత్తగా కన్పించింది గోమతికి.

నువ్వేనా గోమతీ .. నువ్వే? గడియలో ఎంత పెద్దదాని వయి

పోయేవు ? చూపుల్లో ఎన్ని తళుకులు నింపుకొన్నావు; ఈ అందమంతా నీదే ? ఎవరితో పంచుకొంటావు ఈ ఆనందాన్ని అంటూ మనసు ప్రశ్నించింది.

ఒక్కరోజులో తనెంత పెద్దది అయిపోయిందో గోవిందుకిచూపించి ఆశ్చర్య పర్చాలనుకొంది గోమతి. 'అత్తయ్యకి కొత్తబట్టలు చూపించి ఇప్పుడే వస్తానమ్మా' అంటూ రంగమ్మగారి వాటాలోకి పరుగు తీసింది.

పండగ పిండివంటల సందడిలో పొయ్యి పొగలో సతమత మవుతున్న రంగమ్మ వెనుతిరిగి చూసి 'ఎవరమ్మా! ఏం కావాలి?' అంది కూరలబుట్ట పక్కన పెడుతూ.

'నేను అత్తయ్యా గోమతిని. గోవిందు ఎక్కడ ఉన్నాడు ?'

'ఆ' అంటూ నోరింత చేసుకొని కళ్ళు మరంతంత తెరుచుకొని 'ఎవరు ? గోమతి ... నువ్వే' అంటూ దగ్గరికి వచ్చింది రంగమ్మ.

ఆమె చేతిలోంచి జారిన కూరల బుట్టలోని నిమ్మకాయలు పల్లానికి ప్రయాణం సాగించేయి. కొంచెం దూరం వాటిని అనుసరించిన వంకా

యటు ఈ పింతేమిటో చూద్దామని ఆగిపోయేయి.

రంగమ్మ కణతల మెటికలు విరుచుకొంటూ "ఆ పైట పడేసరికి ఎంతగా మారిపోయేవే నా తల్లీ! ఇంకా ఎవరో అనుకొన్నాను" అంది ఆశ్చర్యపోతూ.

ఆమె తనని పట్టిపట్టి పరీక్షగా చూస్తుంటే గోమతికి ఏదో ఇబ్బందిగా అనిపించింది. తను వచ్చింది గోవిందుకోసం కాని నీ మెప్పుకోసం కాదన్నట్లు ఇటు అటు చూస్తూ "గోవిందు ఇంట్లో లేడా?" అంది.

'పూజకి నందివర్ధనం గన్నేరుపువ్వులు ఉన్నాయేమో కోసుకురా రా అన్నాను. పెరట్లో ఉంటాడు చూడు" అంది రంగమ్మ.

గోమతి పెరటివైపు నడక సాగిస్తుంటే "ఏమే చిలకా. ఎక్కడికి అలా రెక్కలు ఆడిస్తూ ఎగిరిపోతున్నావు?" అన్నాడు పురాణం తాతయ్య. ఆ ముసలితాతకి ఆపేరు గోమతి పెట్టిందే. అతడికి గోమతిని పలకరించి మాట్లాడడం అంటే మహా ఇష్టం. ఆ పిల్లని తనదగ్గర కూర్చోపెట్టుకొనేందుకు అరటిపళ్ళు, కొబ్బరిముక్కలు లంచం పెట్టేవాడు.

"పెరట్లో గోవిందు ఉన్నాడేమో చూడాలని తాతయ్యా" ఆగకుండా సాగిపోయింది గోమతి.

రంగమ్మగారి పెరట్లో పళ్ళచెట్లు లేవు కాని ఎర్రగన్నేరు, ముద్దమందార, నందివర్ధనం, సూరువరహాలు వంటి పువ్వుల మొక్కలు ఉన్నాయి. అత్తయ్యా ఎంచక్కా మన పెరట్లో పళ్ళ మొక్కలు వేయించకూడదూ? అప్పుడు ప్లీడరు గారి పెరట్లో కాయలు కోయమన్నా కోయను" అనేది గోమతి. "నువ్వు పుట్టకపూర్వం నేనూ అలాగే అనుకొన్నానే అమ్మాయి. కాని ఏ మొక్క లేసుకొన్నా మాకు మిగిలేవి చిలకకొట్టు కాయలే అని తెలిసేక ఆ ఆలోచన మానుకొన్నాను" అనేది రంగమ్మ నవ్వుతూ.

ఒక ముఖ్యమైన సమస్య మీద ఒక ప్రముఖ దినపత్రిక రాసిన సంపాదకీయాన్ని గురించి ఒక పెద్ద మనిషి దాని సంపాదకునితో :-

"ఇంతకీ ఆ విషయంమీద మీ అభిప్రాయమేమిటో అర్థం కావటంలేదు."

"అలా రాయటానికి నాకు నాలుగ్గంటలు పట్టింది" అని సంపాదకుడు సమాధానమిచ్చాడు.

"ఏం ... అత్తయ్యా నువ్వెప్పుడూ ఇంతే! మన పెరట్లో కాయలైతే పచ్చివి కోరికి పారేస్తావేమిటి?" అనేది గోమతి అలుకతో మూతి బిగిస్తూ. గోమతి అలా మూతి బిగిస్తే ఆ మూతిమీద ముద్దుపెట్టుకోవాలనిపించేది రంగమ్మకి.

"సావిత్రమ్మా! ఏ నోములు నోచి కన్నావమ్మా ఈ చిన్నారిని?" అనేది మెప్పుగా.

"ఏమిటి వదినగారూ, పరిహాసం చేస్తున్నారా? రాత్రి, పగలు దీని అగడాలతో వేగలేక నేను చస్తుంటే నోములు, పూజలు అంటారు, అక్కడ బడిలో పిల్లలతో దెబ్బలాటలు, మేష్టర్ల మాట వినదు; ఇక్కడ ఇరుగుపొరుగుల ఫిర్యాదులు. తనా పరా అన్న మాట లేదు. ఏది కన్పిస్తే దానిని హక్కు భుక్తం చేసుకోవాలని ఎగబడుతుంది. బైటికి వెళ్ళిన పిల్ల ఎవరిచేతా తన్నులు తినకుండా ఇంటికి వస్తుందా అని నేను బెంగపడి చస్తుంటాను. మా గోపాలం వచ్చేక కొంతనయం. వాడు చాలా బుద్ధిమంతుడు. దీని అగడాలు వాడి కట్టుడివల్ల కొంత తగ్గేయి. "ఇంతకీ ఎవరి పోలిక వచ్చిందో కాని, మా పెద్ద పిల్లలు ఇద్దరూ ఇలా ఎరుగరు" అనేది సావిత్రి.

"అ... వాళ్ళకీ గోమతికి సాటేమిటి? మసిబొగ్గుల్లో..." మాట పూర్తిచెయ్యకుండానే ఆపుచేసేది రంగమ్మ

14

మందారచెట్టు వెనకగా ఎవరో నిల్చున్నారు. కాళ్ళు మాత్రం కన్పిస్తున్నాయి. మిగిలిన భాగాన్ని గుబురుగా పెరిగిన ఆకులు కప్పివేసేయి గోవిందుకి వెనకగా వెళ్ళి ఆశ్చర్య పరచాలని మెల్లిగా నందివర్ధనం మొక్కప్రక్కకి అడుగుల చప్పుడు కాకుండా నడిచింది గోమతి. ఆ చెట్టుని చాటుచేసుకొని "గోవిందూ!" అంటూ మెల్లగా పిల్చింది.


ప్లీడరుగారి మామిడిచెట్టు మీద నుంచి "కూ" అంటూ కోయిల సమాధానం చెప్పింది. పిచ్చిమొద్దు! కమ్మని కంఠం ఉందని కూయగానే సరా? నేను నిన్ను పిలువలేదు — అనుకొంది గోమతి.

గోమతి పిలుపు విన్పించిన దిక్కుగా గోపాలం తిరిగి చూసేడు. పచ్చని ఆకులమధ్య అప్పుడే విచ్చిన నందివర్ధనం పువ్వులా ఉంది గోమతి.

"గోమతీ" అన్నాడు గోపాలం ముందుకివస్తూ.

"నువ్వా! ఇక్కడేం చేస్తున్నావు?" అంది గోమతి కొమ్మలు తప్పించుకొంటూ.

"ఈరోజు ఉగాదిపండుగకదూ? నీకోసం ఈ అకు సంపెంగపువ్వులు



తెచ్చేను. ఠాణాకచేరిలో దొంగిలించి కాదుసుమా! ఒక స్నేహితుడి ఇంట్లో ఉంటే అడిగి తెచ్చేను. వీటిని మాలగా కట్టి నీ కియ్యాలని తాపత్రయం. కాని ఆ పని నావల్ల అయేలా లేదు' అన్నాడు గోపాలం సగం కట్టిన మాలనీ, విడిగా ఉన్న పూలనీ చూపిస్తూ.

చేతిలోని పూలమీంచి దృష్టి తిప్పి, ఎదురుగా వచ్చి నిల్చిన గోమతిని పరీక్షగా చూసేడు గోపాలం. పూలు అతడి చేతిలోంచి జారి నేలమీద పడిపోయేయి. అతి చురుగ్గా ఆలోచనలు అందించే మెదడులోని మరలు స్థానాలు తప్పిపోయేయి. సజీవ చిత్రంలా నిల్చిపోయేడు గోపాలం.


ఆశ్చర్యంతో కూడిన ఆ చూపులకి గోమతి తట్టుకోలేకపోయింది. ఆ కళ్ళలోకి తిన్నగా చూడలేకపోయింది. గోపాలానికి అంత దగ్గరగా నిలువలేకపోయింది. ఏదో మత్తుగా మనసు ఊగిపోయింది. త్వరగా వెళ్ళిపోకపోతే తల తిరిగి తూలి పడతానేమో – అనుకొంది.

"ఈరోజు పండుగకదు బావా? నాన్న అందరికీ కొత్త బట్టలు కొన్నాడు. నీ బట్టలు ఇంట్లో వున్నాయి. అమ్మ నీకోసం చూస్తున్నాది, నాబట్టలు బాగున్నాయి కదూ!" అంది తడబడుతూ ఏదో మాట్లాడాలన్న తలంపుతో.

"ఈ బట్టల్లో నువ్వు ఎంత అందంగా ఉన్నావు గోమతీ! ఈ

రోజు నీ అందంతో నాకళ్ళు చీకట్లు కమ్మేయి. నా చిలిపి మరదలు గోమతేనా నాఎదుట ఉన్నది అనే అనుమానం కూడా కలిగింది. గోమతీ! అందమైన ఆడపిల్లలు ఎంత అదృష్టవంతులు! ఎదుటివారికి ఎంత ఆనందాన్ని పంచి ఇవ్వగలరు! ఈరోజు ఉగాది గోమతీ! ఈరోజులాగే ఈ సంవత్సరం పొడుగునా నా కళ్ళముందు నువ్వు...'

'బావా! ఈమాటలు ఏపుస్తకం లోవి?' ఎంతో అమాయకంగా ముఖంపెట్టి అడిగింది గోమతి.



... నయనానందకరమైన ఈ రూపంతో, మనసుని వలవేసిలాగే ఆ చూపులతో ...' గోమతి మాటని వినిపించుకోకుండా గోపాలం తన మనసులో మసలుతున్న ఉత్సాహాన్ని మాటల్లోకిమార్చి చెప్పుకుపోతున్నాడు.

'చూడు బావా! ఈ మధ్య కథల పుస్తకాలు ఎక్కువగా చదవడంచేత కాస్త పైత్యంచినట్లు ఉంది. ఉసిరి పప్పుముద్ద నెత్తిమీద పెట్టుకొని స్నానంచెయ్యి. ఈ తిక్క నిమిషంలో కుదిరిపోతుంది' అంది గోమతి నవ్వుతూ.

'నీ రూపు మారినా, మాట మారలేదు గోమతీ! ఇంక నాకు అనుమానంలేదు. నువ్వు నా చిన్నారి మరదలు గోమతివే' అన్నాడు గోపాలం.

'అయితే మరి సందేహంఎందుకు? ఆ పువ్వులు అందుకో. పండగపూట తలలో పువ్వులు లేకుంటే ఏం బాగుంటుంది?'

'కాని అవి బుగ్గిలోపడిపోయేయి గోమతీ!'

'ఫరవాలేదు బావా! పైకి అంటిన బుగ్గి ఊదేస్తే ఈక్షణంలో పోతుంది. పువ్వుని ఆకర్షించుకొని ఉన్న సుగంధం రోజంతా ఉంటుంది.'

'నిజంగానే ఈ రోజుతో నువ్వు పెద్దదానివి అయిపోయేవు.'

ఆ రోజు రాజా కచేరీలో పువ్వులమాట గుర్తుకు తెచ్చుకొని ఈ మాట అంటున్నావుకదూ బావా! ఆ విధంగా చూస్తే నువ్వు మాత్రం పెదవాడివి కాలేదా! ఆ రోజు నాది కోతి ముఖం అన్నావు, ఈ రోజు అందులో ఏదో అందాలు, ఆనందాలు చూస్తున్నానంటున్నావు.'

గోపాలం చేతిలోని పువ్వులు అందుకొని జడలో పెట్టుకోబోయింది గోమతి. మాల తిన్నగా లేని కారణాన పువ్వులు జడలో సరిగా అమరలేదు.

'ఇలారా! నేను సర్దిపెడతాను' అన్నాడు గోపాలం.

గోమతి దగ్గరికివచ్చి వెనుతిరిగి అతడిముందు నిలబడింది. గోపాలం పువ్వులు ఆమె జడలో సర్దుతుంటే అతడి చేతివేళ్లు క్షణకాలం గోమతి మెడమీద ఇటు అటు తగిలేయి.

ఆ తాకిడిలోని కొత్తదనాన్ని ఇద్దరూ ఒక్కసారే అనుభవించేరు. గోపాలం తన చేతిని కదపలేదు. గోమతి అటునుండి ఇటు తిరుగలేదు. అలా తన్మయతలో ఎంతసేపు నిల్చేరో వారికే తెలియదు.

మామిడి చెట్టుమీది కోయిల ఈ జంటనిచూసి ముచ్చటపడింది. గళమెత్తి తన ఆనందాన్ని గానం చేసింది. తుళ్ళిపడి దూరంగా తొలగి నిలచింది గోమతి. గోపాలం కళ్ళలోకి సూటిగా చూడలేక పోయింది. పెదవి కదిపి ఒక్కమాటకూడా పలుకలేకపోయింది. వసంత సమీరంలా అందాన్ని, ఆనందాన్ని వెదజల్లుకొంటూ ఇంటిలోకి పరుగు తీసింది.

ఒకాయన కిరాణా కొట్లో వందరూపాయలు బాకీ పడ్డాడు. కొట్టువాడు అడుగుతాడేమోనని చూశాడు. నెల రోజులైనా వాడు అడగలేదు. చివరికి ఆగలేక 'బాకీ అడగవేమోయ్ ?' అని అడిగేశాడు.

'మీలాంటి పెద్ద మనుషుల్ని అడిగితే ఏం బావుంటుందండి' అన్నాడు కొట్టువాడు.

'ఎన్నాళ్ళకీ ఇవ్వకపోతే ఏంచేస్తావ్ ?'

'అప్పుడు మీరు పెద్ద మనుషులు కాదని తేల్చేసుకుని అడుగుతానండి!'

పూలమొక్కలు ఉత్సాహంగా తలలు ఊచేయి.

"ఏమిటి సంగతి" అంటూ అప్పుడే వచ్చిన గాలి అసలు కథ తెలియక గుసగుస లాడింది.

కోయిలమ్మ "అంతా నాకు తెలుసు" అన్నట్లు కూకూఅని గట్టిగా కూసింది.

"ఊష్ మరీ అంతగట్టిగాచెప్పకు. ఆ పిల్లడు ఇంకా అక్కడే ఉన్నాడు" అన్నాడు కోయిలమ్మ జతగాడు.

'మందారమొక్క ప్రక్కగా మత్తుగా నిల్చిన చిన్నవాడెనా? అమరేంద్రపదం అందుకొన్నంతగా ఆనందంలో మునకలు వేస్తున్న ఆ అందగాడేనా? ఏమయింది? అతడి కేమయింది?" గోడమీదుగా వొంగి చూస్తున్న జామిచెట్టు ప్రశ్నించింది.

"అది అతడికే తెలియదు. అదే అందులోవున్న తమాషా" అంది నిటారుగానిల్చివున్న నూరు వరహాల చెట్టు.

15

ఆ ఊరులో కాలేజి కొత్తగా పెట్టేరు. ఇంకా సైన్సు తరగతులు ప్రారంభించలేదు. బియస్సీ చదవా లనుకొన్న గోపాలం పై ఊరికిపోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

పిల్లాడిని పైచోటపెట్టి చదివించా లంటే డబ్బుతో కూడుకొన్నపని. రామనాథం జీతం సంసారం గడి చేందుకే కటాకటిగా సరి పోతుంది. భార్యాభర్తలూ ఇద్దరూ జాగ్రత్తగా ఖర్చుచేసుకొనే అల వాటు కలవారు కావడంవల్ల, వస్తున్న ఆదాయంతో గోప్యంగా సంసారం నడుపుకొంటూ ఇతరుల ముందు చెయ్యిజాపకుండాకాలాన్ని నెట్టుకొస్తున్నారు.

రామనాథం పిత్రార్జితంగా వచ్చిన కొద్దిపాటిపొలం అమ్మి ఇద్దరు ఆడపిల్లలకి అన్నోదికాలకి లోటులేని సంబంధాలు చేసేడు. కలిగిననాడు ఏ పండక్కో, పబ్బానికోపిల్చి ఇంత పసుపు, కుంకంపెట్టి అంపకం పెట్ట వచ్చు. లేకపోయినా ఆడ పిల్లల గురించిన బెంగ అతడికిలేదు. ఇంక మిగిలినపిల్ల గోమతి. ఆ పిల్లకి ఏదో విధంగా సొమ్ము జతపెట్టి ఇంత ఉన్నచోట పెళ్ళిచేస్తే ఇంక అతనికి బరువు తీరిపోతుంది.

కాని అర్ధాంతరంగా తయా రయింది గోపాలం చదువు సమస్య. ఇంటికి తీసుకువచ్చినందుకు ఆ పిల్లడికో దారి చూపించాలి. ఈ రోజుల్లో కనీసం ఒక డిగ్రీ అయినా లేనిదే ఉద్యోగాలు దొరకటం కష్టం. ఆ పాటి చదువు ఆ పిల్లడికి చెప్పిం చాలంటే దానికి డబ్బు కావాలి. ఎవరిస్తారు? ఇచ్చినా ఎలా తీర్చడం?

"ఏదో ఒకటి చెయ్యాలి పిల్లడు తెలివిగా చదువు కొంటున్నాడు. అంతగా మనం అప్పు తీర్చలేకపోతే ఉద్యోగంచేసి వాడే తీర్చు కొంటాడు. ఇప్పుడు డబ్బు లేదని మనం కాళ్ళు తే వేస్తే ఏపాటి ఉద్యోగ దొరుకుతుంది? ఎలా బ్రతుక తాడు?" అంది సావిత్రి.

రామనాథం తన ప్రావిడెంట్ ఫండులో లోనుకి అర్జీపెట్టేడు కాని అది సకాలంలో అందేలా అగుపించ లేదు. అవసరానికి వేరేచోట అప్పు చేసి ఆ సొమ్ము అందగానే తీర్చి వేయాలనుకున్నాడు. తనకి కొద్దిగా పరిచయమున్న ఒక మార్వాడీ దగ్గ రికి వెళ్ళేడు. తను వచ్చిన పని వివ రించేడు. మార్వాడీ అతడిచేత నోటు వ్రాయించుకొని రామనాథంచేతిలో సొమ్ము పెట్టేడు. పెడుతూ ఒక మెప్పుదల మాటకూడా జోడించేడు.

"ఈ రోజుల్లో మీ వంటివారు అరుదండీ రామనాథంగారూ! పరాయి పిల్లడికి అప్పుచేసి ఎవరు చదివిస్తారు?" అన్నాడు.

పక్కనే కూర్చున్న మెల్లకన్ను గుమాస్తా గారపళ్ళు బైటపడేలా ఫక్కుననవ్వేడు. "మీవంటి అమాయ కులు కూడా చాలా అరుదుగానే ఉంటారు శెట్టిగారూ! రామనాథం చదివిస్తున్నది పరాయి పిల్లడికి ఎలా అయింది? తల్లీ, తండ్రీ లేని మేన ల్లుడు అంటే ఇల్లరికపుటల్లుడు అన్న మాట కాదా!" అన్నాడు.

అతడి మాటవిని తెల్లబోయి చూసేడు రామనాథం. తమ ఇంట్లో తనకికాని, భార్యకికాని రాని ఆలో చన ఇతడికి ఎలా వచ్చిందో — అని ఆశ్చర్యపోయేడు. వారి దగ్గర సెలవు పుచ్చుకొని డబ్బుని భద్రంగా జేబులో దాచుకొని ఇంటికి బయలు దేరేడు.

దారిపొడుగునా ఆ మెల్లకన్ను గుమాస్తా మాటలే మనసులో కదు లాడేయి. అలా ఎందుకు కాకూ డదు? చేస్తే వచ్చే నష్టమేమిటి? పిల్లలిద్దరికీ ఒకరిపై ఒకరికి అభిమాన ముంది. ఈడూ జోడూ చూడముచ్చ టగా ఉంది. గోపాలానికి తమ కన్నా ఆప్తులు ఎవరున్నారు? తమకి మాత్రం చేయీ, కాలూ ఆడనినాడు ఆదుకొనేందుకు ఎవరున్నారు?

తమకి
స్తాడు. అవసరం...
నంటూ ఆదుకొంటాడు.

ఆ ఆలోచన రావడంతో రామనాథం కాళ్ళు నేలమీద ఆనడం మానివేసేయి. నవ్వుతూ, తేరుతూ ఇంట్లో తిరిగే కూతురు, అల్లుడు; తమ చిన్న చేతులతో తాతయ్య జుట్టు, కళ్ళు పీకేచిన్నారి మనుమలు; 'రామనాథంగారు ఎంత అదృష్టవంతులు. ఈ వయసులో చీకూ, చింతా లేకుండా హాయిగా గడుపుతున్నారు ఆ మేనల్లుడు చేస్తున్నట్లు ఈ రోజుల్లో కడుపున పుట్టిన బిడ్డలు కూడా చెయ్యలేరు' అని మెచ్చుకొనే స్నేహితులు ... ఓహ్ ... ఏమి జీవితం అది. ఏమి శుభదినం ఇది. ఆ గుమాస్తా నోట్లో ఏ దేవుడు దూరి పలికించేడు ? కళ్ళ ఎదురుగా పిల్లడు తిరుగుతున్నా ఇంతవరకు తనకి ఆలోచన ఎందుకురాలేదు ? త్వరగా పోయి ఈ విషయాన్ని భార్యతో చెప్పాలి. చెప్పి, ఆమెని

ఆనందంలో ముంచాలి-అను
రామనాథం.

16

గా ఇల్లు చేరేందుకు
పరుగు పెట్టేడనే
అతడి బట్టలు చెమటతో
యి. అలసటవల్ల ఊపిరి
పరిస్థితిలో ఇంట్లో అడుగు
ట్టుడు.

భర్తని ఆరూపులో చూసి సావిత్రి హడలిపోయింది.

'ఏమయిందండీ! ఏమయింది ?' అంటూ కంగారుగా దగ్గరికి వచ్చింది.

రామనాథం నోటమాటలేదు. లాల్చీ జేబులోంచి బొత్తిగా పెట్టి ఉన్న నోట్లు తొంగిచూస్తున్నాయి.

జేబులో డబ్బునీ, ఆ పరిస్థితిలో భర్తనీచూసి ఏదీ అర్థంకాని దానిలా క్షణకాలం నిలచిపోయింది సావిత్రి. భగవంతుడా ! ఏది ఉన్నా, ఏది లేకున్నా పరువు, ప్రతిష్టలకి భంగం లేకుండా బ్రతుకుతున్నాము. ఈ నిక్షేపాన్ని మానుండి వేరుచెయ్యకు తండ్రీ' అని మనసులోనే నమస్కరించింది.

[సశేషం]

మహామహుల చతురోక్తులు

నెహ్రూ గుజరాత్‌లో పర్యటిస్తున్నారు. కూడా లాల్‌బహదూర్ కూడా జీప్‌లో కూర్చున్నారు. జీప్ చెట్టుకి ఢీకొంది. దెబ్బలేం తగలలేదు కానీ, నెహ్రూ క్రిందపడ్డారు. ఆయనమీద శాస్త్రి పడ్డారు. ప్రమాద వార్త పేపర్లకి ఎక్కిపోయింది.

ఢిల్లీ తిరిగి వచ్చేసరికి, విమానాశ్రయందగిర స్వాగత మివ్వడానికి, అందరూ సిద్ధంగా వున్నారు. పంత్ ఆత్రుతగా పలకరించారు—'ప్రమాదం జరిగిందన్నారు, ఏం దెబ్బలుతగల్లేదు కద!' అని.

'మీరేకనక ఆ జీప్‌లోవుంటే తప్పక దెబ్బలు తగిలేవి. లాల్ బహదూర్ నామీద పడ్డారు కాబట్టి బతికిపోయాను' అని నెహ్రూ జవాబు.



* * *

పండిట్‌జీ ఉపన్యాసమిచ్చి స్టేజీ దిగారో లేదో ఆటోగ్రాఫ్ కోసం ఓ యువకుడు సిద్ధమయ్యాడు 'దస్కత్ పెట్టి'మంటూ. సరే నెహ్రూసంతకం చేశారు. 'డేట్' కూడా వేయండి' అన్నాడు ఆ యువకుడు.

నెహ్రూ డేట్‌కూడా వేశారు.

యువకుడు వూరుకోలేదు. 'సంతకం హిందీలో పెట్టారు, డేటు ఇంగ్లీషులో వేశారేం' అంటూ నిలదీశాడు.



"ఏముందీ? దస్కత్ హిందీ; డేటు ఇంగ్లీషూ-కాదంటావా?" అన్నారు నెహ్రూ.

యువకుడు మరి మాట్లాడలేదు.

గదిలో టెలిఫోను మోగింది.

రిసీవరెత్తి నెహ్రూ 'హల్లో' అన్నారు.



"చూడండీ నెహ్రూగారితో అర్జంటుగా మాట్లాడాలి"- అవతలినుండి.

"మీ రెవరూ మాట్లాడుతూ వుంట?"

"నేను ... రాష్ట్ర ... శాఖా మంత్రిని, ప్రదేశ్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిని, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ డెలిగేటుని నా పేరు ... మీ రెవరు? మాట్లాడుతున్నదీ?"

"నేను జవహర్‌లాల్‌ని."

అజ్మీర్‌లో కాంగ్రెస్ సభ జరుగుతోంది. మహిళలకి ప్రత్యేక



స్థలం కేటాయించారు. చాల మంది పురుషులు అటు వెవు ప్రోగవుతున్నారు. నెహ్రూ వూరుకొంటారా?

"జనానాలో" చెరదలచుకొన్న వారంతా సంతోషంగా చేరవచ్చు. అలా చేరదల్చుకొన్న మగవాళ్ళందరికి నా అభినందనలు" అన్నారు.

జనం నవ్వుకుంటూ తమకి కేటాయించిన స్థలాలలో సర్దుకొన్నారు.

*

1937 లో అఖిలభారత కాంగ్రెస్ మహాసభలు లక్నోలో జరిగాయి. అధికారం చేపట్టడానికి సమ్మతించడమా లేదా అన్న విషయమై చర్చ ఘాటుగా సాగుతోంది. కాంగ్రెస్ సభ్యులు శ్రీ సత్యమూర్తి, నెహ్రూ విసుర్లు విసురు కొంటున్నారు.

"మిత్రులు సత్యమూర్తిగారికి మద్రాసు ముఖ్యమంత్రి అయిపోవాలని వుంది" అన్నారు నవ్వుతూ నెహ్రూ.

వెంటనే సత్యమూర్తి 'అక్కడికి నెహ్రూగారికి భారత ప్రధాని కావాలని లేనట్టు' అని విసిరారు

బహుశా నెహ్రూ సమాధానం ఇవ్వని విసురు అదేనేమో—

*

గాలిబ్ గాథలు

మీర్జా గాలిబ్ కి మామిడి పళ్ళంటే ప్రాణం. అతని స్నేహితు



డికి అవిగిట్టవు. ఇద్దరూ కూర్చుని మాటాడుకుంటున్నారు. రోడ్డు మీద చాకలి పోతున్నాడు. అత- కంటి ముందు బరువంతా మోస్తూ గాడిద నడుస్తున్నది. మామిడి పళ్ళు రోడ్డు మీద చెల్లా చెదురుగా పడి వున్నాయి గాడిద వాసన చూసి తన దారిన తనుపోతోంది.

"మాశాహోయి



గాలిబ్! మామిడిపళ్ళు గాడిదల కూడా గిట్టవు' అన్నాడు స్నేహితుడు.

గాలిబ్ 'అవును! గాడిదలు మామిడిపళ్ళు తినవు' అన్నాడు.

* * *

గాలిబ్ కి జ్వరం వచ్చింది. మీర్ మెహందీ అనే శిష్యుడు కాళ్ళు పడుతున్నాడు.

గాలిబ్ అతనితో 'నువ్వు గౌరవనీయుడివి, ఇలా నా కాళ్ళు పట్టి నాకు పాపం కడ్తున్నావు' అని బాధపడ్తూ అన్నాడు.

'అంత కష్టంగా వుంటే మీ కాళ్ళు నొక్కుతున్నందుకు కూలి యివ్వండి' అన్నాడు మీర్.



గాలిబ్ వూరుకున్నాడు. కాసేపటికి మీర్ పారితోషికం అడిగాడు.

'నువ్వు నా కాళ్ళు నొక్కి పెట్టావు. నేను నీ డబ్బులు నొక్కి పడ్తాను' అన్నాడు గాలిబ్.

* * *

గాలిబ్ బహదూర్‌షా తోటలో ఆయనతో షికారు చేస్తున్నా



మామిడి చెట్లకేసి తదేకంగా చూడటంతో బహదూర్‌షా, 'ఏమిటోయ్ గాలిబ్! ఈ మామిడిపళ్ళని అంత దీక్షగా చూస్తున్నావ్' అనిఅడిగాడు.

'దానం ఇవ్వబడ్డ ప్రతి వస్తువు మీదా, తీసుకొన్న వాళ్ళ పేర్లుంటాయని విన్నాను, నిజమా అని చూస్తున్నాను' అన్నాడు గాలిబ్.

బహదూర్‌షా, అప్పటికి నవ్వి వూరుకొని, తరవాత గాలిబ్ ఇంటికి మామిడిపళ్ళు పంపాడు.

—పి. ఎస్. భట్టు.

□□□

గ్రహాంతర యాత్ర

ప్రథమ బహుమతి

(యా. ౮౮)

ఆది 2767 సంవత్సరం, ఏప్రిల్ 4 వ తారీఖు. కథముందుకు సాగే ముందు ఆనాటి స్థితిగతులు తెలుసుకోవడం అవసరం. ప్రతి ధనికుని దగ్గర గ్రహాంతరయానాలు చేసే రాకెట్లున్నాయి కొందరు ధనికులు కాని సైంటిస్టులు వాటిని స్వయంగా తయారు చేసుకునేవారు. ఈ విధంగా అనేక మంది దగ్గర అవి వుండటంవల్ల అనేక గ్రహాలను శోధించారు. కాని యీ అనంత విశ్వంలో, అవి ఏపాటి? లక్షల మంది దిగినా ఒక గ్రహాన్ని పూర్తిగా శోధించలేరుగదా? కాబట్టి మానవ మాత్రుడు దిగని గ్రహాలెన్నో వున్నాయి.

ఆరోజు అర్ధరాత్రి, హైదరాబాదు నగరంనుండి, కుజగ్రహం వైపుగా ఒక రాకెట్ దూసుకుపోయింది. దాని పేరు ఎస్-1. దానిలో సైంటిస్టు సూర్యనారాయణ, సింహాచలం ఉన్నారు. సూర్యనారాయణ నడుపుతున్నాడు. అతని ఎదురుగా ఒక గాజుపలక వుంది. దానిమీద అనేక మీటలున్నాయి. ఎదురుగా ఒక తెర వుంది. సింహాచలం ఏదో పానీయం ఫోర్సుపంపుతో కడుపులోకి తీసుకొన్నాడు. పంపులేనిదే పానీయం కడుపులోకి వెళ్ళదు అంతరిక్షంలో.

"అయితే సూరీ!, కుజగ్రహం ఇదివరలో మనం దిగిందేకదా—మళ్ళీ అక్కడి కెందుకు?– వెధవ రాళ్ళూ రప్పలూ తప్పితే అక్కడేం వున్నాయ్ కనక?–"

"కుజగ్రహానికి కాదోయ్ మనం వెళ్ళేది. దాని ప్రక్కన బోల్డు గ్రహాలున్నాయ్. ఇది చూడు, దీనిమీద యిప్పటికెవ్వరూ దిగలేదు–చూడు" అంటూ ఒక మీట నొక్కాడు. తెర మీద ఒక గ్రహం ప్రత్యక్షమయింది. అబ్బ – అదెంత ముచ్చటగా వుందని! – ఆ గ్రహం ఎరుపు, నీలం రంగు లీనుతోంది.

"చూశావా దీనిమీద దిగి, అక్కడి పరిస్థితిని పరిశోధిస్తే ఆ ఖ్యాతి మనకే దక్కుతుంది. నాకు డబుల్ పి హెచ్. డి., ట్రిబుల్

నోబెల్ ప్రైజు వచ్చినట్టిస్తారు. అసలిలాంటి గ్రహం వుందనికూడా ఎవరికీ తెలీదు"- అంటూ ధన్‌మని ఒక మీట లాగాడు సూరి. ఆ అంతరిక్ష నౌక మెల్లగా ఆ గ్రహం మీద దిగింది. సూరి 'టెంపో మీటర్'ని చూచి "అరేబాప్, ఉక్కడ— 250 డిగ్రీలా బాబూ" అంటూ "మంచు మయమన్నమాట. నీటి మంచుకాదు – వాయువులు గడ్డకట్టేటంత శీతలం" అని క్యాబిన్‌లో ఒక మూలవున్న డ్రస్సు తొడుక్కొన్నాడు. చలంకూడా అదేపని చేశాడు. అది తొడుక్కొంటే, యిద్దరు చెరొక గ్లోబుల్లాగున్నారు. కాళ్ళుమాత్రం బయటికొచ్చాయి. 'అంతరిక్ష నౌక తలుపు తీసుకొని గ్రహంమీద కాలు పెట్టారు.

ఇద్దరి కళ్ళూ పరవశించాయి. అక్కడ నేలంతా స్పాంజిలాగుంది. నడుస్తోంటే స్ప్రింగులమీద నడుస్తోన్నట్లుగా వుంది. అంతేకాదు, నేలంతా చదరంగం బల్లలాగ గళ్ళు గళ్ళుగా వుండి, కొన్ని గళ్ళు ఎరుపూ– కొన్ని నీలి రంగులు వెదజల్లుతున్నాయి. సూరి తన డ్రస్సులో వున్న ఒక మీట నొక్కి, అంతరిక్ష నౌకలోవున్న కంప్యూటర్‌కి ఆర్డరిచ్చేశాడు అది గబగబా, వంద శ్నాప్స తీసేసింది.

"చలం! మన మిప్పుడు స్పాంజి మీద నడుస్తోన్నట్లుగా వుండడానికి కారణం యిక్కడి వాయువులన్నీ గడ్డకట్టిపోవడం. మన మిప్పుడు వాయు హిమంమీద నడుస్తున్నాం" అన్నాడు సూరి. ఇలా వీళ్ళు ఒక మైలుదాకా వచ్చేశారు. చలం ఏదో జవాబు చెప్పబోయేటంతలో సూరి, చటుక్కున ఒక మీట నొక్కి చలం నోరు మూయించేశాడు. ఇద్దరు ఎదురుగా చూశారు. వాళ్ళకు ఎదురుగా వంద గజాల దూరంలో రెండు ఆకారాలు ఎనిమిదడుగుల ఎత్తున్నాయ్, వీళ్ళవైపే చూస్తున్నాయి. వాటికి ముక్కు, మొహం ఏమీ లేవు. నునుపుగా స్తంభాల్లాగ వున్నాయి.

సూరి తిరిగి పది శ్నాప్స తీయించాడు. వాళ్ళతో మాట్లాడాలి అనుకొన్నాడు. కాని లాంగ్వేజ్? పోనీ తనకు తెలిసిన భాషలు ట్రైచేద్దాం, కొద్దిగా మార్పుచేసి అనుకొన్నాడు. అనుకోవడమే తడవుగా ఆచరణలో పెట్టేశాడు తన మాతృభాషలోనే ప్రయత్నిద్దాం అనుకొని గబగబా, ఆ ఆకారాల దగ్గరి కెళ్ళి...

"మీార్ ఏప్రప్?" అన్నాడు. అవి

ఎమ్. నాగేశ్వరరావు

సెకండియర్, బి.ఎస్‌సి. (ఎం పి.సి)
గిరిరాజ్ గవర్నమెంట్ ఆర్ట్సు
కాలేజి, నిజామాబాదు,

ఒకదానివైపు ఒకటి చూసుకొని, ఏదో అర్ధమయినట్లుగా తల, అంటే వాటి పైభాగం పంకించి.

"మ్యాం మీాక్ హెూన్ చేయం" (మేము మీకు హాని చేయం) అన్నాయి. సూరి సంతోషపడిపోయి, ఒక మీట నొక్కి ఆ సంభాషణంతా రికార్డు చెయ్యమని కంప్యూటర్‌కి ఆర్డరిచ్చేడు. గ్రహాంతర సంభాషణలను రికార్డు చేయడానికి ప్రత్యేకంగా నిర్మించిన అతి ఖరీదయిన టేపు తిరగసాగింది.

తెలుగునే కొద్దిగామార్పుచేస్తే వీళ్ళ భాష అయిపోయినందుకు ఎంతో సంతోషించాడు చలం.

ఇంతలో సూరికి ఒక దుర్బుద్ధి పుట్టింది ఏకంగా వీటిని భూలోకానికి తీసుకుపోదాం అనుకున్నాడు. వెంటనే ఒక మీట నొక్కాడు. ఎస్-1, మాగ్నెటిక్ ఛాంబర్ తలుపులు తెరుచుకొన్నాయ్ పాపం ఆ గ్రహవాసులవైపు, మాగ్నెటిక్ ఫీల్డు ఫోకస్ చేయబడింది. వారిద్దరు రయ్‌మని ఆ ఛాంబర్‌లోకి దూసుకుపోయి పడడం, తలుపులు మూసుకోవడం ఆటోమేటిక్‌గా జరిగాయి.

కాని అదే సమయంలో సూరి, సింహాచలాలు గూడా రయ్‌మని ఎగిరి ఎక్కడో పడ్డారు సూరి దులుపుకొని లేచి 'డామిట్, వీళ్లు కూడా తెలివయినవాళ్ళేనే!' అనుకొని, తనున్నచోటు చూసుకొని, అదిరి పడ్డాడు అది ఎస్-2 అంతరిక్ష నౌక క్యాబిన్. సూరికి అంతా అర్ధమయిపోయి నీళ్ళుకారిపొయ్యాడు.

'ఒరేయ్... చలం! వాళ్ళు గ్రహవాసులు కాదు నర్సిగాడు, దయ్యంగాడూ. వెధవలు దొంగచాటుగా 'సూర్యనారాయణ—2' (ఎస్-2) రాకెట్టు వేసుకొచ్చారు. ప్చ్... నా పి. హెచ్. డి. నోబెల్ ప్రైజూ!' ఇంతలో అంతరిక్షనౌక తలుపులు తెరుచుకున్నాయ్.

అక్కడ, నర్సి ఉరఫ్ నరసింహమూర్తి, దయ్యం అనగా దయానిధి నిలబడి వున్నారు, పాపం తలొంచుకొని. దయానిధి ముందుకొచ్చి, ఏదో ఎక్స్‌ప్లయిన్ చెయ్యబోయాడు సూరి ఖస్సుమన్నాడు. "వెధవల్లారా, మామూలంగా బోల్టు టేపు వేస్తుయుంది మాలాంటి డ్రస్సు వేసుకున్నా ఆనవాలు కట్టేవాణ్ణి.

పోటీదార్లకు మనవి

'జ్యోతి' చిన్నకథలపోటీకిరచనలు పంపే విద్యార్థినీ విద్యార్థులు గమనించవలసిన నిబంధనలు :-

1 కథలు 'జ్యోతి'లో రెండు, మూడు పేజీలకు మించరాదు.

2 స్వకపోల కల్పితమైన స్వతంత్ర రచననే పంపాలి

3 తమ పూర్తిపేరు, చదువుతున్న తరగతి, కాలేజి లేక విశ్వవిద్యాలయం పేరుతో సహా తమ పూర్తి చిరునామా జతపరచాలి.

4. ప్రతినెల 1వ తేదీ వరకు అందిన రచనలను ఆ పై నెలసంచికలో పోటీనిమిత్తం పరిగణిస్తాము.

5 బహుమతిపొందని రచనలు త్రిప్పి పంపబడవు అందుచేత స్టాంపులు పంపించ నక్కరలేదు. రచనల విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

6. కవరుమీద, రచనమొదటి పేజీమీద 'జ్యోతి చిన్న కథల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.

ఏదో పొడిచేసినట్లుగా 'వరికల్' ప్రశ్న వేసుకొన్నారు ఛీ ఛీ

'అదికాదురా సూరీ! మిమ్మల్ని చూసి గ్రహవాసులనుకొన్నాం, అందుకే నేనుకూడా, మీ ఫోటోలు తీసి, మిమ్మల్ని హైద్రాబాదు పట్టుకెడదామనుకొన్నాను.'

'విద్యలేక పొయ్యావు...ప్చ... నిన్ను అసలు నా రాకెట్టెవడు ముట్టుకోమన్నాడు?' అన్నాడు సూరి కోపంగా. ఆఖరికెలాగయితేనేం వాళ్ళు రాకెట్టెక్కి భూలోకానికి చేరుకొన్నారు. ఇంతలో హఠాత్తుగా చెవులు చిల్లులు పడేట్లు గణగణమని శబ్దం వినపడింది

సూరి ఉలిక్కిపడి లేచాడు. అలారం మ్రోగుతోంది. గడియారంలోని రేడియంముల్లు అయిదయినట్లుగా చూపెడుతోంది. హారి...నీ ఇందంతా కలా? అనుకొన్నాడు సూరి బి యెస్సీ ఫస్టియర్.

పాపం సప్లిమెంటరీకి కడుతున్నాడు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది, కలలోవలె 2767 సంవత్సరం తన రోల్ నంబర్ అని, ఏప్రిల్ 14 వ తారీఖునుంచి పరీక్షలు మొదలని. ప్చ...పాపం. బద్ధకంగా ఒళ్ళు విరుచుకొంటూ లేచాడు పక్కమీంచి.

□□□

దీని కియు బహుమతి (రూ. 25)

స్వయంకృతాపరాధం

నిశ్శబ్దంగా ఉంది క్లాస్ రూమ్. ఇంగ్లీషు లెక్చరరుగారు పాఠం చెబుతున్నారు. ఇంతలో వెనుక బెంచీల నుండి పిల్లికూతలు వినబడ్డాయి. లెక్చరరుగారు పాఠం ఆపి క్లాస్‌వైపు చూశారు మరల నిశ్శబ్దం. లెక్చరరుగారు పాఠం మొదలుపెట్టగానే మరల పిల్లి కూతలు వినిపించాయి.

'నంబర్ 25, స్టాండప్' లెక్చరరుగారు ఆదేశించారు.

ఆ శాల్తీ లేచినుంచుని నవ్వుతోంది.

'ఎందుకు నవ్వుతున్నావ్?' ప్రశ్నించారు లెక్చరరుగారు.

'బాగుందండి మీ ప్రశ్న. అందరూ ఎందుకు నవ్వుతారు?' ఎదురుప్రశ్న వేశాడతను.

'ఏదైనా నవ్వు పుట్టించే సంఘటన జరిగితే నవ్వుతారు. నేను సీరియస్‌గా పాఠంచెబుతుంటే నీకు నవ్వెందుకువచ్చింది?'

'సీరియస్‌గా చెబుతున్నానని మీరు అనుకొంటున్నారు. మీ సీరియస్‌నెస్ చూసినాకునవ్వువచ్చిందండి' ఎగతాళిగా అన్నాడతను.

'నో ర్మియ్ ఇందాకటినుండి గమనిస్తున్నాను. క్లాసులో గొడవ చేస్తోంది చాలక, నవ్వుతావా? నీలాంటి వాడు క్లాసులో ఉండడము మంచిదికాదు గెటవుట్', గర్జించారు లెక్చరరుగారు.

'కాలేజీకిడబ్బు కడుతోందిబయటకు పోవటానికి కాదండి' నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు

'డబ్బుకట్టినంత మాత్రాన క్లాసులో కూర్చొనటానికి అర్హుడవు కావు. క్రమశిక్షణగూడా ఉండాలి. మర్యాదగా బయటకు పోతావా?

మల్లు సుబ్బారెడ్డి
సెకండ్ బి ఎస్ సి, (ఎం.పి.సి.)
వి. యస్. ఆర్. కాలేజి.
తెనాలి

లేక ప్రిన్సిపాల్ గారికి రిపోర్టిమ్మం టావా ?"

ఏమనుకొన్నాడోగాని నెమ్మదిగా బయటకు పోయాడు

ఆరోజు క్లాసులో చాలామంది విద్యార్థులు అతన్ని పొగిడారు.

"భలేగా ఏడిపించావ్ గురూ" అని ఒకడంటే,

"ఆయనపరువు తీసేశావ్ బ్రదర్" అని మరొకడు.

"ఆ కెమిస్ట్రీ లెక్చరరుకు నిక్కు ఎక్కువగా వుందిరా" మరొకడి ఫిర్యాదు

"అందర్నీపట్టి చూద్దాంలే గురూ" అతని అభయహస్తం.

ప్రతి క్లాసులోను అతను ఏదో విధంగా గొడవ చేస్తూనే ఉన్నాడు. ఆ రోజు కెమిస్ట్రీ లెక్చరరుగారు పాఠంలో నిమగ్నులై ఉన్నారు.

"ఈరోజు చాలా బాగా చెబుతున్నారండి" అతనన్నాడు.

"నిన్నెవరూ వ్యాఖ్యానించమని అడగలేదు" లెక్చరర్ గారు అన్నారు.

"ఇది ప్రజాస్వామ్యమండి. ప్రతి ఒక్కడికి వాక్స్వాతంత్ర్యంఉందండి" అన్నాడతను.

"ఇచ్చిన హక్కును జాగ్రత్తగా కాపాడుకోవడం మంచిది. అయినా, నాతో ఆటలాడవద్దని హెచ్చరిస్తున్నాను."

"సెలవులలో ఆడుకొందాంలెండి" నవ్వుతూ సమాధానమిచ్చాడు.

"యూ డర్టీఫెలో" పళ్ళు పటలాడించాడు.

"పొద్దున్నే స్నానంచేసి వస్తే డర్టీ ఫెలో అంటారేమిటండి ?" అన్నాడతను.

"తెలివిగా మాట్లాడుతున్నాననుకోకు ఇంతవరకు నేను నిగ్రహంగా వ్యవహరించాను. ఇప్పుడు నేను ప్రిన్సిపాల్ గారికి ఈ విషయం రిపోర్టు చేస్తున్నాను" అన్నారాయన.

మరునాడే అతన్ని వారం రోజులు సస్పెండ్ చేస్తున్నట్లు నోటీసు వచ్చింది.

"నన్ను సస్పెండ్ చేశారట. దీనికి వ్యతిరేకంగా మనం స్ట్రయికుచేద్దాం" అన్నాడతను.

"సారీ గురూ. నిన్ను హద్దుమీరి గొడవచేయమన్లేదు. మేమేం చేయలేము. వుయ్ కాంట్ హెల్ప్" అన్నారు అతని నేస్తగాళ్ళు. అతని మొహం నల్లగా మాడిపోయింది. ఒక్కసారి తన స్నేహితుల ముఖాలవైపు నిస్సహాయంగాచూచి, బరువుగా అడుగులేస్తూ సాగిపోయాడు ఆ స్వయం వంచితుడు.

□□□

అత్తమీద కోపం...

ద్వితీయ బహుమతి
(రూ. 25)

మాలతి చెంప ఛెళ్ళుమంది. కోపంగా తలెత్తి చూసింది భర్తవైపు కిషోర్ నిర్వికారంగాకోటు బటన్స్ విప్పుతున్నాడు. మాలతికి ఒళ్ళు మండింది. విసురుగా లోపలి కెళ్ళిపోయింది.

కిషోర్ సిగరెట్ వెలిగించాడు. "ఎంత కలెక్టరయితే మాత్రం-అంత మంది ఎదుట అవమానపరుస్తాడా? అసలు పర్సనల్ అసిస్టెంట్ అంటే తన అరుగుమీదుండే అల్సేషియన్ అనుకుంటున్నాడేమో! ఇన్నాళ్ళ తన చాకిరీని మర్చిపోయి యూస్ లెస్ ఫెలో అంటాడా! అధికారం ఉందికదా అని ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే ఎవరు సహించగలరు? హుఁ! సహించక ఏంచెయ్యగలరు? ఆ ఉద్యోగం లేకపోతే పూట గడవదు. అందుకనే తప్పనిసరిగా ఊరుకోవలసి వస్తోంది. ఇందాకటి విషయం గుర్తొచ్చింది కిషోర్ కి. "తనింతగా చీవాట్లు తింటూ కష్ట పడుతున్నది మాలతికోసం, బేబీ, బాబులకోసం కాదూ! ఆఫీసులో అవమానం పొంది నీరసంగా వచ్చి తలుపులు తడితే తలుపు తెరుస్తూనే సంజాయిషీలు అడుగుతుందా? ఛీ ఛీ". వేలు చుర్రుమంది. సిగరెట్ అవతల పారేసి, మళ్ళీ బూట్లు తొడుక్కుని బయటికి వెళ్ళిపోయాడు కిషోర్.

* * *

బాబు హడిలిపోయాడు. గబగబా వెళ్ళి అద్దంలో చూసుకున్నాడు. ఎడమచెంపమీద అయిదు వేళ్ళూ అనమాలు పడ్డాయి. కోపంగా అమ్మ వైపు చూశాడు. మాలతి కాఫీగ్లాసు, టిఫిన్ప్లేటు లోపలికి తీసికెళ్తోంది.

"ఎంత అహంకారం అయనకి!"

పి. వి. రమణ,

ఫస్ట్ బి. ఏ. (హెచ్.పి.ఇంగ్లీష్)
గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్
రాజమండ్రి.

మాలతి కళ్ళు ఎర్రబడ్డాయి. తనేం తప్పు చేసిందని అసలు! ఆలస్యంగా వచ్చారేం అని అడగడం తప్పా! అంతమాత్రానికే చెయ్యి చేసుకో వాలా? ఇన్నాళ్ళూ ఎంతో ప్రేమగా చూసుకునేవారు. హఠాత్తుగా ఏమొచ్చింది? భార్య అంటే అట బొమ్మ అనుకొంటున్నారు కాబోలు. ఎంత అవమానం! ఇంత వరకూ ఎవరూ తనని కొట్టలేదు. అది చాలక టిఫిన్ తీసికోకుండా, చెప్పకుండా మళ్ళీ ఎక్కడికి వెళ్ళినట్లు? ఎవరిని సాధిద్దామని? సరే. ఆయనకంత పట్టుదలైతే తనకే నా లేనిది! దానికితోడు ఈ బాబుగా డొకడు. వాడికన్నీ ఇప్పుడే కావాలి. పారం చెప్పించుకోవాలనుంటే రాత్రి అడక్కూడదూ! అందరి కందరే. ప్లేటు కడగడానికి వెళ్ళింది మాలతి. అక్కడితో ఆలోచనలాపి పనిలో మునిగిపోయింది.

♦ ♦ ♦

బేబీ కెవ్వుమంది. "ఏడవకు. మళ్ళీ కొట్టానంతే" కసిరాడు బాబు. అతి కష్టంమీద దుఃఖాన్ని అపుకుని, బుగ్గ తడుముకుంటూ అన్న కేసి చూసింది జాలిగా. బాబు పుస్తకం లోకి చూస్తున్నాడు దీక్షగా. కాని చదువుతున్నదేదైనా బుర్రకి ఎక్కితేగా!

"ఛీ ఆ మేష్టారు మంచివాడు! పాఠం చెప్పమంటే కొట్టాలంట అవునుమరి, ఆ మాస్టారు చెప్తే అర్థం కావు ఈ ఇంగ్లీషు పాఠాలు. వచ్చే సంవత్సరం ఫస్ట్‌ఫారంలోకి వస్తాడు కూడాను ఇంగ్లీషు రాకపోతే ఎలాగ? అయినా ఎప్పుడూ అడగ్గానే చెప్పేది ఇంచక్కా. ఈసారి ఎందుకు కొట్టింది? అసలు అమ్మకి నేనంటే ఇష్టంలేదు. బేబి అంటే ముద్దు" బేబీకేసి చూశాడు. "గాలి పటం కట్టడం నేర్పాలిట! బుద్ధిలేదసలు. చదువుకుంటుంటే వచ్చి విసిగిస్తుందెప్పుడూ" బాబు పుస్తకం మూసి లేచి నిలబడ్డాడు "పోనీ రాము నడుగుతాను" అనుకుని పరిగెత్తాడు పక్కింటికి.

♦ ♦ ♦

"అన్నయ్య ఎంత చెడ్డవాడో! అనవసరంగా కొట్టాడు. పక్కింటి రామూ కైతే అడగ్గానే నేర్పేడు. తనడిగేసరికి కొట్టాడు. ఛీ తన కంటే పెద్దవాడు కాని, లేకపోతే..." ఆలోచనలు చెదిరిపోయాయి బిస్కట్టుకోసం కాలు నాకుతున్న కుక్కపిల్లని కోపంగా చూసింది "పో, అవతలకి" గట్టిగా తన్నింది దాన్ని. కుక్కపిల్ల కుంయ్ మంది.

□□□

పొట్టి కథలు

ఒక ప్రాథమికోపాధ్యాయుడు లైట్ లేకుండా రాత్రి సైకిల్ త్రొక్కుతూ వుంటే పోలీసు పట్టుకొని కేసు పెట్టాడు.

అతనికి కోర్టువారు విధించిన శిక్ష 'లైట్ లేకుండా రాత్రి సైకిల్ త్రొక్కడం తప్పు' అని నూరు సార్లు ఇంపోజిషన్ వ్రాయడం!

—బి. కె. వేణి.

*

సలుపు పెడుతున్న పన్ను పీకించుకుందామని పళ్ళ డాక్టరు దగ్గర కెళ్లాడు దానయ్య.

డాక్టరు పరీక్ష చేస్తుంటే జేబులో చెయ్యి పెట్టుకున్నాడు దానయ్య.

డా : 'డబ్బు ఇప్పుడే ఇవ్వనక్కర లేదు.'

దా : 'అవు ననుకోండి, మత్తు మందు ఇస్తారటగా. డబ్బులు లెక్క జూనుకోడం మంచిదని ...' నసిగాడు దానయ్య.

—జి సుధాకర రెడ్డి.

*

ఒకడు :– 'బాబూ! అనుపత్రికి దారి ఎలాగో చెప్తారా?'

రెండవవాడు :– 'ఎదురుగావచ్చే అంబ్యులెన్స్ కారుక్రింద పడండి. అనుకున్న చోటికి ఖచ్చితంగా చేరుతారు.'

—కె. శ్రీరాం.

*

జీవితంలో బాగా అనుభవం గడించిన ఓ పెద్ద మనిషి ఇలా అన్నాడు —

'పెళ్ళయిన మొదటి సంవత్సరం భర్త మాటాడుతాడు, భార్య వింటుంది. రెండవ సంవత్సరం భార్య మాటాడుతుంది, భర్త వింటాడు. మూడో సంవత్సరం వీరిద్దరూ మాటాడుతుంటే పక్కింటి వాళ్ళు వింటారు.'

జి. వి. సుబ్రహ్మణ్యం.

*

ఒకసారి ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఒక రైలు పెట్టెలో ఎక్కాడు. ఇద్దరు ఇంగ్లీషువారి మధ్య వున్న

ఒక సీటు ఖాళీగా వుంది. నేరుగా పోయి అక్కడ కూర్చున్నాడు విద్యాసాగర్.

ఒక ఆంగ్లేయుడు విద్యాసాగర్‌ని చూసి 'యాస్' (గాడిద) అన్నాడు. మరొకడు 'పిగ్' (పంది) అన్నాడు.

విద్యాసాగర్ తొణుకు బెణుకు లేకుండా 'అవును. ఆ రెండింటి మధ్య వున్నాను నేను' అన్నాడట.

—ములుమూడి సాయిప్రకాష్.

*

'సుబ్బారావుగారూ! సమయానికి డబ్బు సహాయంచేసి ఆదుకున్నారు. మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను.'

'జాగ్రత్త! దావా వెయ్యగలను!'

*

'శాస్త్రిగారూ! ఈ ప్రపంచంలో అన్నిటి కంటె కష్టమైన పనేది?'

'కడుపునిండా పెళ్ళి భోజనం చేసి, పీటమీద చేయి ఆనించకుండా లేవడం!'

—ఎస్. పి. కె. మల్లిఖార్జునరావు.

*

ఒకావె :- 'ఈ హాల్లో ఏం సినిమా?'

ఒకతను :- 'ప్రేమించి చూడు.'

—పాలకోడేటి కృష్ణమూర్తి.

*

ఒక తెలుగు పండితుని వ్యాకరణ సూత్రం : 'వాక్యమందు మధ్యన ఎచ్చటను అచ్చు వ్రాయరాదు.'

— ఎం. మంజురాణి.

*

ఒక ముష్టివాడి దీనాలాపం :-

'బాబూ! రెండు పైసలున్నాయి. తొంభై ఎనిమిది పైసలుంటే పదె య్యండి. లాటరీ కట్టుకుంటాను.'

—సోమిన శివరామప్రసాద్.

*

సుబ్బారావు తమ్ముడు అప్పారావు. వాళ్ళ అమ్మ అప్పారావుతో 'మీ అన్నయ్య నీ కంటె ఏడాది పెద్ద' అంది ఒకరోజు.

ఏడాది తర్వాత సుబ్బారావు దగ్గరికి అప్పారావు వెళ్ళి 'ఇప్పుడు నువ్వు నాకు అన్నయ్యేకాదు, నేను నీకు తమ్ముడ్ని కాదు. మన ఇదరి వయసు ఒకటే తెలుసా?' అన్నాడు.

—'బంటి'

□□□

(గత సంచిక తరువాయి)

కిశోర ప్రాయం

విజయలక్ష్మి రామకృష్ణన్

స్వేచ్ఛలభించిన పంజరపు పక్షుల లాగ ఆ మూడవ రోజున జానకి, నారాయణరావు తీర్థయాత్రకు బయల్దేరి వెళ్ళారు.

తన గదిలోనే పక్కవేయించుకున్న అక్కనుచూసి అనంత 'నాకు భయంలేదక్కా, నేను ఒంటరిగా పడుకోగలను' అన్నది. వసంత కాస్త సిగ్గుగా నవ్వి 'నీ ముఖం, నువ్వు పడుకో' అన్నది. అనంతకు నిద్రపట్టలేదు. రెండువారాలయినా ఒకజాబుకూడా యాత్రలకు వెళ్ళిన వాళ్ళదగ్గరనుంచి రాలేదు. అనంతకు నానాటికీ బెంగ ఎక్కువవుతోంది.

అది గ్రహించిన వసంత చెల్లెల్ని మరింత శ్రద్ధగా చూడడం మొదలు పెట్టింది. నోరువిప్పి అడిగే అవసరం లేకుండానే ఏవేళకేది కావాలో అమర్చిపెట్టేది అనంతకు. అనంతకిదంతా క్రొత్తగా తోచింది. 'నిన్న కాక మొన్న ఈ ఇంటికి వచ్చింది. ఈ ఇంట్లో పెరిగిన నన్ను అతిథి లాగ చూస్తున్నది' అనుకున్నది అక్కనుగురించి అనంత. జానకి, నారాయణరావు ఇంట్లో లేకపోవడం ఆ భావానికి దోహదమయింది. 'వాసు మామూలుగానే ఉన్నాడు. ఏమైనా ఇల్లు వసంతదైనది కదా!' అనుకుంది.

ఆ రాత్రి భోజనాలదగ్గర వాసు 'ఏమిటి రోజువిడిచి రోజు చిక్కుడుకాయ చేసేస్తున్నావు, వేరే కూరలేమీదొరకడంలేదా?' అన్నాడు భార్యతో. వసంత 'అనంత కిష్టమని చేస్తున్నా' నంది. అనంతకు ఒళ్లు మండిపోయింది. తన పళ్ళెంలోంచి చిక్కుడుకాయ వేపుడు తీసి ఇల్లు

సీరియల్

మీద పడేస్తూ "ఏమిటీ గెస్టు ట్రీటు మెంటు నాకు" అని విసుక్కుంది.

వాసు, వసంత ఉలిక్కిపడ్డారు. వాసుకు వసంత మనసూ తెలుసు, అనంత బాధా తెలుసు. అందుకే ఏమీ మాట్లాడలేకపోయాడు. పెండ్లయ్యాక స్త్రీకి సహజంగాకాకపోయినా "ఇల్లాలితనం" రాకతప్పదు. వసంతకు అనంతం కే చెల్లెలిమీదఉండే సహజమైన అపేక్షేగాక, జానకి తర్వాత ఆ ఇంటి కోడలుగా కూడా అనంత యెడల బాధ్యత వహించాలనే కోరిక గలిగింది. అనంత విసుగుతో వసంత మనసు గాయపడింది.

ఆ రాత్రి అనంత ఆ ఇంటినుంచి ఎట్లా బైటపడ్డమా అని ఆలోచించడం మొదలుపెట్టింది. అక్క చదివినట్లే ఏ మద్రాసులోనో, హైద్రాబాదులోనో హాస్టల్లో ఉండి చదవాలనుకుంది. బి. యస్సీ రెండేళ్ళు చదువయ్యింది. ఇంకో ఏడాది భాగ్యానికి ఊరు మారడం ఎట్లా? కారణం ఏమిటని చెప్పడం? అనుకుంది. ఆలోచిస్తూ ఎప్పుడు నిద్రపోయిందో ఆమెకే తెలీదు.

మర్నాడు వాసు మెడికల్ స్టోర్సుకు వెళ్ళబోతుండగా అనంత వచ్చి "బావా! మెడికల్ కాలేజిలో సీట్లు ఎనిమిదివేలు విరాళమిస్తే దొరుకుతాయట కనుక్కో, నాకు ఒక సీటు కొనివ్వు" అంది. వాసు ఆశ్చర్యపోతూ "అనంతా. నాన్న చదవమన్నపుడు భయమనే దానివి, చదవలేననే దానివి, ఇప్పుడెందుకుమనసయ్యింది.

> ## జరిగిన కథ
>
> నారాయణరావు, రాఘవరావు బాల్య స్నేహితులు. నారాయణరావు కొడుకు వాసు. రాఘవరావు కూతుళ్ళు వసంత, అనంత. తల్లి పోయినప్పటినుంచి అనంత బందరులో నారాయణరావు భార్య జానకి పెంపకంలో పెరిగి పెద్దదవుతుంది. గుంటూరులో జానకి అన్నగారికొడుకు కృష్ణమోహన్‌ను అనంత ప్రేమిస్తుంది. కృష్ణమోహన్ చెల్లెలు జగన్మోహిని వాసును ప్రేమిస్తుంది. వసంతకు ఎన్ని సంబంధాలు వచ్చినా పెళ్ళి కుదరదు. అనంతను కృష్ణమోహన్ కివ్వడం నారాయణరావు కిష్టంలేదు. కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేయలేకపోయాననే అనే దిగులుతో రాఘవరావు చనిపోతాడు. తర్వాత కొన్నాళ్ళకి గుంటూరులో జగన్మోహినికి బాగా జబ్బుచేసి చనిపోతుంది. ఈలోగా వాసు, వసంతలకు మనసు కలుస్తుంది. వారి అభీష్టాన్నిబట్టి నారాయణరావు వారిద్దరికి పెళ్ళిచేస్తాడు.

మెడికల్ కోర్సంటేనా?' అనడిగాడు.

'ఔను. ఇదివరకు చదవలేననే అనుకున్నాను. అప్పుడే చేరినా ఒకసారో, రెండుసార్లో తప్పేదాన్ని, కనుక బి. యస్సి. రెండేళ్ళు వృధా అయిందనుకోకు. ఇప్పుడు నా మనసు గట్టిపడింది.



బావా, ఇహ ఎటువంటి చాపల్యమూ నన్ను జయించలేదు. నేనెందుకు చదవలేననే పంతంకూడా పెరిగింది నాకు. కనుక ఎనిమిది వేలు దండగవుతాయని అనుకోకు' అంది.

వాసు అనంత భుజం మీద చెయ్యేస్తూ, 'పిచ్చిదానా. నీకు నిజంగా చదవాలనుంటే ఎనిమిది వేలు కాదు, ఈ యిల్లూ వాకిలీ అమ్మడానిక్కూడా నేను వెనుకాడను. కాని ఆ అవసరం నీకులేదు. నాన్న మన కిద్దరికీ చెరిసగంగా పంచి వ్రాశారు తనకున్న ఆస్తి. అది నీ చదువుకు దివ్యంగా సరిపోతుంది. నువ్వు నన్ను ప్రాధేయపడాల్సిన అవసరం లేదు నీకు' అన్నాడు.

అనంత ఆశ్చర్యంగా 'అదేమిటి మామయ్య ఎందుకట్లా వ్రాశారు? నాకు ఆస్తిలో భాగం దేనికి?' అన్నది వాసు ఎటో చూస్తూ 'ఎందుకంటే నేనేం చెప్పను? మీ నాన్నగారికి స్నేహితుడిపై వున్న నమ్మకం మా నాన్నకు కొడుకుమీద లేకపోయింది' అన్నాడు కాస్త బాధగా.

వాసు బాధ అర్థమయింది అనంతకు. కాని ఎట్లా సర్దిచెప్పాలో తెలియలేదు. 'ఛీ అదేమిటి బావా. మామయ్యకు నీపై ఎప్పుడూ అపనమ్మకంలేదు. పోనీ నీకు నామీద నమ్మకముందికదా? నిన్ను అడగడానికి, నీతో నాబాధ పంచుకోడానికి నాకెప్పుడూ సంకోచం వుండదు. ఈ పంపకాల సంగతి మర్చిపోదాం మనం. నాకెప్పుడు కావాలన్నా నిన్ను అడుగుతాను. నువ్వులేదనవని నాకు తెలుసు' అంది.

వాసుకు బరువు దించినట్లయింది 'నువ్వు కాలేజీకి వెళ్ళు' నేను సీటు సంగతి కనుక్కుంటాను' అన్నాడు. ఆరోజే దరఖాస్తు ఫారాలకు ఉత్తరాలు వ్రాశాడు ఆరోజు మధ్యాహ్నం భోజనానికి యింటికి వచ్చినప్పుడు అనంత కోరిక సంగతి భార్యకు చెప్పాడు వాసు. వసంత వెంటనే బదులు చెప్పలేదు. ఆలోచిస్తూ వుండిపోయింది. వాసు 'ఏమిటి ఆలోచిస్తున్నావు' అనడిగాడు.

వసంత 'అనంతకెందుకీఆలోచన కలిగిందో తెలియదుగాని, యిదీ ఒకందుకు మంచిదే!' అన్నది. వాసు 'ఎందుకని' అన్నాడు. 'నందిని పుట్టినపుడు మీఅక్క చచ్చిపోయిందే. అప్పుడు అనంత పడిన ఆవేదన నేను కళ్ళారా చూశాను. అనంత స్నేహితురాలు కామేశ్వరి బిడ్డను చూచినపుడు అది రెండురాత్రిళ్ళు నిద్రపోలేదు. బయలాజికల్ ప్రోసెసెస్ అంటేనే దానికి భయం, జుగుప్స ఏర్పడ్డాయి. ఆ భయం అట్లాగే

ఇంకో మతిమరుపు మేష్టారి కథ. ఓరోజు ఆయన కాలవలో స్నానంచేస్తూ మునిగిపోతుంటే చుట్టుపక్కలవాళ్ళు రక్షించారు. వాళ్ళలో ఒక తెలిసినతను 'మీకు ఈతవచ్చు గదా మేష్టారూ?' అని అడిగాడు.

'వచ్చు. ఆ ధైర్యంతోనే లోతుకుపోయాను. తీరా వెళ్ళాక ఈతవచ్చునన్న సంగతి మరిచిపోయి మునిగిపోవడం మొదలెట్టాను. ఛీ ఛీ. ఏం మతిమరుపో!' అన్నారు మేష్టారు.

వుండిపోయిందంటే అది ఎప్పటికీ పెళ్ళి చేసుకుని సుఖపడలేదు. ఆ భయం, ఏహ్యభావం పోవాలంటే మెడికల్ కోర్సుకు వెళ్ళడమే సరియైనది. స్వయంగా చదవడం, కళ్లారా చూడడం, చేతులారా నేర్చుకోడంతో కాని ఆ బెదురు పోయి సహజంగా మనుష్యుల్లో పడదు. అది సరే, ఈ ఏడాది క్రొత్తగా ఇంకో మెడికల్ కాలేజి తెరుస్తున్నారు. ఈ ఏడాది క్లాసులుకూడా తక్కువ వచ్చాయనుకున్నారు. మళ్ళీ అప్లికేషన్ పెట్టమనండి. సీటువస్తే సరే, లేకపోతే అప్పుడు డబ్బుపెట్టి కొనవచ్చు" అంది వసంత. వాసు మురిపెంగా భార్యవంక చూచి "నువ్వు నిజంగానే కరణేషు మంత్రివి" అన్నాడు. వసంత నవ్వుతూ "అంతేనా, ఇంకేమీ కానా?" అనడిగింది చిలిపిగా.

"అబ్బే ఎందుకయ్యిందీ? నువ్వు

ఆరు గుణాలుకల దొడ్డ ఇల్లాలివి, సరేనా!" అన్నాడు వాసు వసంత అతని వ్యంగ్యానికి బదులుగా "ఔను పాపం, నాకేవున్నాయి అరిషడ్వర్గాలు, మీరు మహర్షులు కాదు మరి?" అంది. వాసు నవ్వి "గుమ్మడి కాయల దొంగలంటే నీలాంటివాళ్లే" అన్నాడు.

నెల తిరిగేటప్పటికే వసంత వాక్కు ఫలించి అనంత ఇంటర్మీడియట్కు వెళ్ళడం, గుంటూరు మెడికల్ కాలేజిలో సీటు దొరకడం కూడా జరిగాయి. వాసు అనంతను వెంట పెట్టుకుని గుంటూరు వెళ్ళాడు. మేనమామ ఇంటికే వెళ్ళాడు.

కమల సంతోషంగా ఆదరించి "హాస్టల్లో ఎందుకమ్మా, ఇంట్లోనే వుండరాదూ? మోహాని పోయిం తర్వాత నే నింట్లో తిరగలేకుండా వున్నాను" అన్నది. అనంత బదులు చెప్పేలోగా వాసు "కాదులే అత్తయ్యా. హాస్టల్లో వుంటేనే చదువుకు సౌకర్యంగా వుంటుంది. అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటుంది లెండి" అన్నాడు. అనంత "కూతుళ్ళు లేని వాళ్ళందరికీ నామీద ఆపేక్ష కలుగుతుంది దేనికో? బాగుంది ఈ 'యూనివర్సల్ డాటర్' పదవి నాకు!" అనుకుంది. "ప్రతి ఆదివారమైనా వస్తూండు అనంతా" అన్నది కమల

వాళ్ళు వెళ్ళినప్పుడు కృష్ణమోహన్ వూళ్ళో లేకపోవడం మంచిదయ్యిం దనుకున్నాడు వాసు అనంతను ఆ సాయంత్రం హాస్టల్లో చేర్పించి, దగ్గరగావున్న పోస్టు ఆఫీసులో అనంతపేర ఐదువందల రూపాయలు డిపాజిట్టుచేసి పాసుబుక్కు అనంత కిచ్చాడు వాసు. వారానికి రెండు జాబులైనా వ్రాయమని మరీ మరీ చెప్పి మర్నాటి రాత్రికి ఇంటికి తిరిగి వచ్చాడు వాసు. "అనంత మెడికల్ కాలేజీలో చేరిన సంగతి తెలిస్తే నాన్న ఎంతగానో సంతోషిస్తారు. వెళ్ళి రెండు నెలలవుతున్నా ఇంతవరకు ఒక్క జాబూ వ్రాయలేదు. ఏ వూరులో వున్నారో తెలియక నేను వ్రాయడానికి లేదు" అనుకున్నాడు వాసు.

ఆ రాత్రి భోంచేస్తూ "ఏమిటి వంట ఈ పూట క్రొత్తగా ఉంది" అన్నాడు వాసు.

వసంత "ఔను ఈ పూట వంట నేనే చేశాను. ప్రొద్దున వంటచేస్తూ నరసమ్మ క్రింద పడిపోయిందట. పనిమనిషి పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పింది. డాక్టరుగారికి ఫోను చేశాను. ఆయనవచ్చి చూసి బ్లడ్ ప్రెషరని చెప్పి మందులు వ్రాసిచ్చి వెళ్లారు. మన స్టోరుకు ఫోనుచేసి మందులు తెప్పించి ఇచ్చాను. బాగా తగ్గేవరకు వంటకు రావద్దని చెప్పి ఇంటికి పంపించాను" అంది

"పాపం వైధవ్యంతో త్వరగా వచ్చిన వార్ధక్యం, చేతికి ఇంకా అందిరాని

ఒక్కగానొక్క కొడుకు, వాడికోసం కష్టపడి సంపాదించాలన్న తాపత్రయం!' అన్నాడు వాసు నిజమైన సానుభూతితో.

వసంత భర్తకు నెయ్యి వడ్డిస్తూ 'ఆ అబ్బాయి మొన్న మార్చిలోనే యస్సెల్సీ పూర్తి చేశాడట. టైపు నేర్చుకుంటున్నాడు. ఒక పరీక్షకు వెళ్ళాడట కూడా. అతనికి ఎక్కడైనా పని చూపించకూడదూ మీరు?' అంది.

వాసు సంతోషంగా 'యస్సెల్సీ ప్యాసయి, టైపు కూడా నేర్చాడా, అయితే ఎవరితోనైనా కబురు పంపించు, నన్ను వచ్చి చూడమని' అన్నాడు.

వాసు పడుకుని డైజెస్టు చదువుతున్నాడు. వసంత లేత తమలపాకులకు పచ్చకర్పూరం కలిపిన సున్నంరాసి, యాలగ్గింజలు, జాపత్రి ముక్కలు, జాజికాయ పొడుమూ కలిపిన వక్కపొడివేసి, పన్నీటిలో తడిపి మొగలి రేకులో చుట్టివుంచిన కాచుముక్క కాస్తంతవేసి ఆకులు మడిచి బొడ్డు తుంపిన లవంగమొగ్గ గుచ్చి భర్తకు తాంబూల మిచ్చింది.

తాంబూలం అందుకుంటూ 'ఏమిటి ఆలోచిస్తున్నావు వసంతా' అనడిగాడు వాసు.

'ఆఁ ఏమిలేదు, మన ఇంటిచుట్టు ప్రహరీగోడ సగం పడిపోయింది బాగుచేయిస్తే కాస్త తోట వేసుకో వచ్చునూ, నాకు కాస్త పని వుంటుంది, కాలక్షేపమవుతుంది' అంది వసంత.

వాసు 'మనకు ఖాళీ చోటు ఎక్కువ. ఎంత తోటయినా వేసుకో వచ్చుగానీ, చుట్టూ ప్రహరీ గోడ కట్టాలంటే బోలెడవుతుంది నాన్న రెండేళ్ళకు మూడేళ్ళకు ఒకసారి ఇటుకలుపెట్టి అడుసుతో గోడలు పెట్టించడం, ఒక్క గాలివాన రావడంతో గోడసగం నేలకూలడం జరుగుతూ వుంటుంది. దానికేదన్నా వేరే వుపాయం చూడాలి. ఈ ఇల్లుకూడా పాతదయింది. బాగు చేయించాలి' అన్నాడు.

వసంత సంతోషంగా 'నేను అనుకున్నాను కాని మీతో చెప్పడానికి భయమేసింది' అన్నది. వాసు ప్రేమగా భార్యను చేతుల్లోకి తీసుకుంటూ 'భర్తంటే భార్యకు వుండాల్సింది భయం కాదు వసంతా' అన్నాడు.

కాసేపాగి 'ఏమిటాలోచిస్తున్నారు డబ్బును గురించా? నూజెళ్ళలో ఆ ఇల్లు దేనికి? పొలం కౌలుకు ఇవ్వడం దేనికి? అవి అమ్మకంపెట్టి సగం డబ్బు అనంతపేర బ్యాంకులో వేద్దాం. నాన్న అంతా నాకిచ్చినా అనంతకు సగం ఇవ్వాలనే వుంది నాకు కాని నేనిస్తే అది తీసుకోదు దానిక్రింద మీరు ఖర్చుపెట్టండి నా డబ్బుని తెలియనివ్వకుండా మిగతా



సగం ఖర్చుపెట్టి మన ఇల్లు బాగు చేయించుకుందాం" అంది వసంత.

'నాన్నకు తెలియకుండా మీ నాన్నగారి ఆస్తి అమ్మడం నా కిష్టం లేదు. అదట్లాగే వుండనీ కొన్నాళ్ళు. నా యిన్సూరెన్సు డబ్బు చేతికివస్తే అది ఖర్చు పెడదాం యిప్పుడు" అన్నాడు.

లేడికి లేచిందే పరుగన్నట్లు వాసు అ మర్నాడే ఇంజనీరును కలుసుకుని ఇల్లు రీమోడల్ చేయించడానికి సలహాలు తీసుకున్నాడు. అదివరకు వున్న నుయ్యి త్రవ్వించి పెద్దది చేయించాడు. మోటారుపెట్టి బావి నీళ్ళు తోటలో నాలుగు ప్రక్కలా వెళ్ళేటట్లు కాలవలు కట్టించాడు. ఇంటి చివర హద్దు పొడుగునా సిమెంటు స్తంభాలువాతి ముళ్ళతీగ చుట్టించాడు. తీగకు బైటువైపున దగ్గర దగ్గరగా కిత్తనార కుదుళ్ళు పెట్టించాడు. లోపలి ప్రక్కన వరసగా సరుకు మొక్కలు నాటించాడు. అక్కడే క్రింద గచ్చుచేయించి పైన పెంకుటి వసారా దింపించి దాంట్లో రెండు గదులు పెట్టించాడు. తోట పని, ఆవు పని చూసే మనిషి వుండడం కోసం ఒకగది. తోట పనిముట్లు, తవుడుబస్తా, తెలకపిండిబుట్ట పెట్టడానికి యింకోగది. గదుల ప్రక్కగా పొడిగించిన వసారాలో ఆవు మేత వెయ్యడానికి తొట్టి కట్టించాడు. కట్టుకొయ్యగ్గాను ఇటుకలతో చిన్న తిన్నె కట్టించి దానికి నాలుగువైపుల యినపరింగులు బిగించాడు. గడ్డివామికి ఒకప్రక్క స్థలంవదిలి, ఖాళీ

చోటులో ఒక పాతిక గినీగ్రాసు కుదుళ్ళు పెట్టించాడు. ఇంకో ప్రక్కన జొన్నలు చల్లించాడు ఆవు మేతకోసం.

గోశాలకు, తోటకు మధ్యగా మళ్ళీ సిమెంటు స్తంభాలు పాతించి ముళ్ళతీగ వేయించాడు. తీగకు లోపలవైపున వరసగా కొబ్బరి మొక్కలు నాటించాడు. ఇంటి వాడకపు నీళ్లు పారేచోట అరటి పిలకలు పెట్టించాడు. ముందువైపున ఇంటికి మూడుప్రక్కలా చుట్టు తీగ పెట్టించి తీగకు అల్లుకునేటట్లు ప్రక్క ప్రక్కగా రంగురంగుల బోగెన్‌విల్లా కొమ్మలు పాతించాడు. పూల మొక్కలు, కూరపాదుల విషయం భార్యకు విడిచిపెట్టాడు. డాబామీద నీళ్ళకు తొట్టి కట్టించి కొళాయినీళ్లు తొట్టెలోకి పోవడానికి, తొట్టిలోని నీళ్ళు ఇంట్లో అమర్చిన కొళాయిల్లోకి రావడానికి వీలు కలిపించాడు.

ముందున్న చిన్నగదుల మధ్యలో గోడపడకొట్టించి డ్రాయింగురూము పెద్దదిగా చేశాడు. క్రిందనున్న రెండు పడకగదులకు అనుకొనేట్లు స్నానాలగదులు కట్టించాడు. డాబామీద ఒక గది, కలిసివున్న బాత్‌రూముతో కట్టించాడు. ఇల్లంతా రీవైరింగు చేయించాడు. ఇల్లంతా వెల్లవేయించి, తలుపులకు, కిటికీలకు రంగులు వేయించాడు. ఇంటికి బైటవైపు మడులు మడులుగా పూల మొక్కలు పెట్టించింది వసంత. రంగు రంగుల గులాబి మొక్కలు తెప్పించి నాటించింది. ఇంటికి ఎదురుగా లాన్ వేయించింది. కిటికీలకు బైట చిన్న చిన్న తొట్లు అమర్చి వాటిల్లో పెటూనియాస్, పెన్సిల్ జినియాలు పెంచింది. పడగ్గది కిటికీకి దగ్గరగా సన్నజాజి, విరజాజితీగలు పెట్టించి పందిళ్ళు వేయించింది.

ముందు వరండా స్తంభాలకు, మేడమెట్లకు, చిన్న కుండీల్లో నాటిన మనీప్లాంట్సును అల్లించింది మూడు నెలలయ్యేసరికి యిల్లురూపే మారిపోయింది. ఆ మూడు నెలలు తపస్సు చేసినట్లు

> నిప్పు లేందే పొగ రాదంటారు. కాని, ఎప్పుడైనా ఖర్మం చాలక పొయ్యి రాజెయ్యవలసిన అవసరం తగిలిన ప్రతి మగవాడికి ఇది అబద్ధమని తెలుసు.

వేరేధ్యాస లేకుండా ఇంటి పనుల్లో, తోటపనుల్లో మునిగి పోయారు వాసు, వసంత. క్రొత్త క్రొత్త అందాలు సంతరించుకున్న యిటినిమాసి యిద్దరుమురిసిపోయి తృప్తిగా ఒకరి నొకరు అభినందించుకున్నారు.

ఈ లోపల ఒక్కసారి మాత్రం అనంత నీవో పండగ సెలవలు మూడు రోజులు కలిసివచ్చినందున యింటికివచ్చి వెళ్ళింది. ఆ రాత్రి పడుకోబోతూ "వెళ్ళి ఒక్క ఉత్తరమైనా వ్రాయలేదు అత్తయ్యా, మామయ్యాను" అంది వసంత. వాసు ఏమీ బదులు చెప్పలేదు. ఆ తెల్లవారేటప్పటికే టెలిగ్రాం వచ్చింది, నారాయణరావు దగ్గరనుంచి, ఆ మూడోనాడు తిరిగి వస్తున్నట్లు. వాళ్ళ సంతోషానికి మేరలేదు. వాసు వెంటనే అనంతకు వైరిచ్చాడు. శనివారం సాయంత్రం కాలేజి మూయగానే బయలుదేరి రమ్మని. మూడో రోజు ప్రొద్దున్నే వాసు, వసంత కారు తీసుకుని స్టేషనుకు వెళ్లారు.

రైలు దిగ్గానే వసంత జానకిచేతిలోంచి మరచెంబు, సంచి తీసుకుంది. "ఏమిటింతచిక్కిపోయావు వసంతా" అంది జానకి. "మీరు వుత్తరమే వ్రాయలేదేం అత్తయ్యా" అన్నది వసంత. "మీ మామయ్యని అడుగు. ఎన్నిసార్లు వ్రాసినా పోస్టుచేశారు కారు. ఇంటిమీద ధ్యాసవుంటే యాత్రల పుణ్యం దొరకదట" అంది జానకి.

"అనంత రాలేదేం" అన్నాడు నారాయణరావు. వాసు, వసంత మాట్లాడకుండా ఒకరినొకరు చూసుకుని నవ్వుకున్నారు. కారు ఆగింతర్వాత జానకి, నారాయణరావు దిగ్భ్రాంతులై యింటివైపే చూస్తుండిపోయారు. "దిగండి నాన్నా" అన్నాడు వాసు. జానక్కి వూరూరా చూసిన వింతలకన్నా తిరిగివచ్చి చూసిన తమ ఇల్లే పెద్ద వింతగా తోచింది. వసంత లోపలకువెళ్ళి అందరికీ కాఫీలు తెచ్చిచ్చింది.

"నరసమ్మఏదీ" అందిజానకి. "నరసమ్మ కొడుకు మన స్టోరులోనే పని చేస్తున్నాడు. కొడుక్కి వండిపెట్టు

కుంటూ వాళ్ళింట్లోనే వుంటోంది. బ్లడ్ ప్రెషర్ వచ్చింది. అందుకని పంటకు రావడంలేదని అన్నాడు వాసు. 'అనంత కాలేజికి వెళ్ళిందా? ఇవాళ మానేస్తేనేం? మధ్యాహ్నం భోజనానికైనా వస్తుందా' అన్నాడు నారాయణరావు చిరాగ్గా. వాసు 'అనంతకి ఏడాది మెడికల్ సీటు వచ్చింది నాన్నా, గుంటూరులో వుంది. మీ టెలిగ్రాం రాగానే దానికి వైరిచ్చాను. ఆదివారం వస్తుంది' అన్నాడు.

'నిజంగా?' అన్నాడు నారాయణరావు. అతని హృదయం సంతోషంతో నిండిపోయింది. జానక్కి ఆశ్చర్యంలో నోట మాట రాలేదు.

'ఆ మధ్య నాన్న పోయేముందు ఈ ఇంటికి ఒకావిడ కొడుకును వెంటపెట్టుకు వచ్చింది గుర్తుందా? ఆ అబ్బాయికూడ గుంటూరులోనే సీటు వచ్చిందట. మన అనంత క్లాసుమేటట. మొన్న సెలవలకు వచ్చినప్పుడు అనంత చెప్పింది. ఆ అబ్బాయిపేరు హరికృష్ణ ఏమిటో చెప్పింది' అన్నది వసంత.

జానకి నారాయణరావు ఒకరినొకరు చూసుకున్నారు.

నారాయణరావు 'జానకీ, ఇహ నుంచి ప్రతి ఏటా నిన్ను యాత్రలకు తీసికెళ్తాను. తీర్థయాత్రలవల్ల ఇంత

మంచి ఫలితాలుంటాయని అనుకో లేదు నేను' అన్నాడు.

'అయితే వసంతా, వంట కూడా నువ్వే చేస్తున్నావా?' అంది బాధగా జానకి.

వాసు 'ఔనౌను నీకోడలు గ్యాస్ పొయ్యిలమీద వండుతూ వారుస్తూ ఒకే కష్టపడి పోతోంది' అన్నాడు

భోజనాలయ్యాక వాసు 'అమ్మా వంతులు వేసుకున్నట్లు ఇల్లు ఇహ మీరుచూసుకోండి. నేనువచ్చే నెల్లో బనారస్ వెళ్తాను ఇంట్లో వుంటే నాకు చదువు సాగదు. స్నేహితుడికి వ్రాశాను ఒక చిన్న ఇల్లు చూడమని. వసంతను తీసికెళ్తాను పరీక్షలయింతర్వాత ఉత్తరాన నాలుగు వూళ్లూ తిరిగివస్తాం' అన్నాడు

'బాగుంది, వసంతనెట్లా తీసికెళ్తావు. ఈ ఆరు నెలలు దాన్ని అరగదీసి ఆరవ చాకిరీ చేయించుకున్నది చాలు! వేళకు పొళకు తిని విశ్రాంతి తీసుకోవలసిన సమయం దానికి నువ్వెళ్ళడానికి తొందర లేదులే. పైన గదిలో చదువుకో. పరీక్షకు నెల్లాళ్ళముందు వెళ్తే చాలు' అన్నది జానకి. వాసు వసంత వంక ప్రశ్నార్థకంగా చూశాడు. వసంత సిగ్గుపడి లోపలకు వెళ్ళిపోయింది. వాసుకు విషయం అర్థమై లేచి వెళ్ళిపోయాడు. నారాయణరావుభార్యతో 'ఈ వయసులో ఇంత హఠాత్తుగా నాకింత శాంతి, హాయి, తృప్తి దొరుకుతాయని అనుకోనే లేదు' అన్నాడు.

జానకి 'నేను మాత్రం అనుకున్నానా, మీ అజమాయిషీలో మనుష్యుల్ని, ఇంటినీకూడ ఎండబెట్టారయ్యే! పిల్లల తెలివితేటలతో మళ్లీ ఇల్లు పచ్చగా కళ కళ్లాడుతూవుంది. ముందుగా మనుమరాలు పుట్టాలని మొక్కుకున్నాను ప్రొద్దుట. ఆ కోరిక తీరితేయింక నాకు తీరని కోరిక లేదు' అంది తృప్తిగా.

నారాయణరావు 'నేను ఎవరినీ ఎండ బెట్టలేదు జానకీ! పిల్లలకు గారాబంకన్నా క్రమశిక్షణ ఇవ్వడం అవసరమనీ, సంపదలు ఇవ్వడం కన్నా సంస్కారం ఇవ్వడం మేలని నమ్మాను ఆ నమ్మకం ఇప్పుడింకా దృఢమైనది కిశోరప్రాయంలో మనిషిని పడిపోకుండా నిలబెట్టగలిగేది రక్తగతమైన సంస్కారం, పెంపకంలో లభించిన క్రమశిక్షణ, విద్యార్జితమైన విచక్షణా మాత్రమే! మనము వాటి విలువలు గుర్తించి పిల్లలను పెంచాము అందుకే ఈనాడు మన పిల్లలకు సుఖమూ, మనకు శాంతీ లభించాయి' అన్నాడు నారాయణరావు.

[సమాప్తం]

□□□

పేకముక్కలతో మనోబలం

సిగరెట్లకు దాసులైన ప్రతివాడికీ పైకి ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా, సిగరెట్లు మానేస్తే బావుండుననే వుంటుంది. పూర్తిగా మానడం సాధ్యంకాకపోతే, పోనీ సిగరెట్ల సంఖ్యను తగ్గించగలిగినా బావుండునని వుంటుంది.

సిగరెట్లు మానడానికిగాని, తగ్గించడానికిగాని మనోబలం చాలా అవసరం. అయితే మనోబలంకూడా అభ్యాసంచేత రావలసిందేగాని, ఒక్కసారిగా రాదు ముందు మనోబలాన్ని సంపాదించాలి దానికి ఒక పాశ్చాత్య వైద్యుడు ఒక ఉపాయం సూచిస్తున్నాడు.

డిసెంబరు 30వ తారీకున (31 ఆదివారం షాపులుండవు) ఒక పేక కొనండి 1968 జనవరి 1వ తేది నుంచి (న్యూయియర్) ప్రతిరోజూ పొద్దున లేవగానే ఇదీ మీ కార్యక్రమం

పేక బాగా కలపండి మధ్యలో నుంచి మీకు చేతికొచ్చిన ముక్క తియ్యండి అది నాలుగు అనుకోండి. ఆరోజున మీరు కాల్చవలసింది నాలుగు సిగరెట్లే. రెండయితే రెండు సిగరెట్లు, ఆరయితే ఆరు, తొమ్మిదయితే తొమ్మిది, పదయితే పది (పేకమీద అంకెని బట్టి)

సాధారణంగా బొమ్మలన్నిటికీ పదేసి సిగరెట్లు కాని, డైమన్ జాకీకి నాలుగే. కళావరు రాజుకు ఆరు. ఇస్పేటు రాణీకి పన్నెండు. ఆఠీన్ ఆసుకు పదిహేను. మిగతా ఆసులకు పదకొండేసి జోకర్వస్తే మీపంట పండిందన్నమాటే ఎన్ని కాల్చాలని వుంటే అన్ని కాల్చవచ్చు

ఇలా ఒక నాలుగైదు నెలలపాటు మీరు నిష్ఠగా, నిగ్రహంతో ధూమపాన వ్రతాన్ని అనుష్ఠించండి. నెమ్మదిగా మీకు మనోబలం అలవడుతుంది. క్రమంగా మీరు సిగరెట్లకు దాసులు కావడం మానేసి, మీకే సిగరెట్లుదాసీలయిపోతాయి. కొన్నాళ్ళకి పేకముక్కల సహాయం లేకుండానే 'నే నివ్వాళ నాలుగే కాలుస్తాను ఏం చేస్తావో చేసుకో' అని మీ మనస్సుని మీరు అదుపులో పెట్టుకోగలుగుతారు ఇంకా కొన్నాళ్ళకి అసలు సిగరెట్లే మానగలిగే మనోబలం మీకు వచ్చినా రావచ్చు.

అప్పుడు చూస్కోండి. 1969 జనవరి నాటికి మీరు ఎలా కలకల్లాడి పోతుంటారో! బరువు పెరగడం, మొహంలో తేజస్సూ, కళ్ళల్లో బల్బులూ అవీ వెలగడం, ఇంకా ఎన్నోమార్పులు వస్తాయిటు.

—టి. వి. ప్రసాద్

సినిమా

ఆంధ్రప్రదేశ్ రాజధానిలో పురివిప్పిన చిత్రపురి

వైశాల్యంలో అమెరికాలోని ఎమ్. జి. ఎమ్ చిత్రపురిని మించిన 'బ్రహ్మానంద చిత్రపురి' ఆంధ్ర రాజధానిలో వెలుస్తున్నది.

భాషా రాష్ట్రిలలో ఆరంభ స్థానం వహించిన ఆంధ్ర బహుభాషా చిత్ర నిర్మాణానికి ప్రోత్సాహ ప్రోద్బలాలు ఇవ్వడంలో కూడా ప్రథమ స్థానం వహిస్తుంది.

శ్రీ రామకృష్ణ ప్రసాద్, సి. వి. ఆర్ ప్రసాద్, శ్రీ గుత్తా రామినీడు, శ్రీ పి గంగాధరరావు, శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు, శ్రీ ముసల్ రెడ్డి, శ్రీ రామకృష్ణారెడ్డి, శ్రీ ఏ. శంకరరెడ్డి మొదలైన పెద్దల కృషి ఫలితంగా ఆంధ్ర రాజధానిలో 'మా ఇంటి మహాలక్ష్మి', 'ఎత్తుకు పైఎత్తు', 'చదువుకొన్న అమ్మాయిలు' 'రహస్యం' మొదలైన చిత్రాలు రాజధాని చిత్ర చరిత్రలో శ్రీ, చుక్కలు చుట్టాయి, పెట్టాయి

మొన్న ఆంధ్రప్రదేశ్ అవతరణ వార్షికోత్సవంనాడు బహు భాషా నటుడు, దర్శకుడు, నిర్మాత ఎల్. వి ప్రసాద్ 'ప్రసాద్ స్టుడియోస్'కు, ఆయనచే వెండితెరకు పరిచయం చెయ్యబడిన శ్రీ ఎన్. టి. రామారావు 'రామకృష్ణ- ఎన్. ఏ టి. కంబైన్స్' స్టుడియో'కు శంకు స్థాపనోత్సవం జరిపించారు. నాటి సభకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ పట్టం



'ఆడపడుచు'లో శోభన్‌బాబు, వాణిశ్రీ, చంద్రకళ, రామారావు

★ ★ ★ ★

'పుణ్యవతి'లో రామారావు, రంగారావు





"అసాధ్యుడు" చిత్రంలో కృష్ణ, కె ఆర్ విజయ

* * * *

"రహస్యంలో" గుమ్మడి, రంగారావు



థానుపిళ్ళై అధ్యక్షత వహించారు. ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి శంకుస్థాపన జరిపారు సమాచార శాఖామంత్రి శ్రీ కొండా లక్ష్మణ్‌బాపూజీ, హైదరాబాద్ ఫిలిం వాణిజ్య మండలి అధినేత శ్రీ రమేష్‌చంద్ర లాహొటి మొదలైన వారు ముఖ్య ప్రసంగాలు చేశారు

తారాగణం నుంచి, ఫిలిం పారిశ్రామిక, సాంకేతికగణం నుంచి నాగేశ్వరరావు, సావిత్రి, జెమినీ గణేశ్, జగ్గయ్య, అంజలీదేవి, జయలలిత, కృష్ణకుమారి, గీతాంజలి, ఎస్. వి రంగారావు, పద్మనాభం, రేలంగి, సూర్యకాంతం, రాజసులోచన, దుక్కిపాటి మధుసూదనరావు, తాతినేని ప్రకాశరావు, సి. ఎస్. రావు, సి నారాయణరెడ్డి, హిందీ చిత్ర నటదర్శక నిర్మాత చంద్రశేఖర్, కవి హస్రత్ జయ్‌పురి మొదలైనవారు స్టుడియో ద్వయ నిర్మాణ ప్రారంభ సంరంభానికి స్వయంగా వచ్చారు

నాటి ప్రసంగాలనుబట్టి ఒక సంవత్సరంలోనే 'బ్రహ్మానంద చిత్రపురి'లో చిత్ర నిర్మాణం ప్రారంభమౌతుందని, హైదరాబాద్‌లో ఏ భాషలో చిత్రంతీసినా అర లక్ష రూపాయల సహాయం పథకం మరి కొంతకాలం కొనసాగుతుందని, బ్రహ్మానంద చిత్రపురిలోని 206 ఎకరాల స్థలం చాలక పోయినట్లయితే ఇంకా ఎక్కువ స్థలం కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా వుందని, చలనచిత్ర కళ, ఇతర లలితకళల ప్రోత్సాహానికి ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు కేటాయిస్తుందని గట్టిగా చెప్పవచ్చు.

రామారావుగారు వచ్చేఉగాదికే హైద్రాబాద్‌లో చిత్ర నిర్మాణం ప్రారంభిస్తారని తెలుస్తున్నది 20 ఎకరాల స్థలంలో ఈయన స్టుడియో నిర్మిస్తున్నారు. స్టుడియో పరికరాలు ఈవరకే సమకూర్చుకొని వున్నారు. ఇప్పటి కార్యక్రమం బట్టి శ్రీ రామారావు, శ్రీ త్రివిక్రమరావు హైదరాబాద్‌లో రెండు చిత్రాలు, మద్రాసులో రెండు చిత్రాలు దాదాపు ఏక కాలంలో నిర్మించే యత్నంలో వున్నారు. సంవత్సరంలో అధిక భాగం హైదరాబాద్‌లోనే ఆయన మకాం చేసే కాలం ఎక్కువ దూరంలో లేదు.

వచ్చే ఉగాదికి రాజధానిలో ఎన్. టి ఆర్. ఎస్టేట్‌లో సినిమా ప్రదర్శన విభాగం కూడా ప్రకాశిస్తుంది.

శ్రీసారథి స్టుడియోస్‌లో మరొక ఫ్లోర్ కూడా సిద్ధమై, మరొక టెక్నికల్ యూనిట్ కూడా సమకూరి, సదరన్ మూవిటోన్ అభివృద్ధిపొంది, ఎన్. ఏ టి., ప్రసాద్ స్టుడియోలు కూడా పనిలోకి దిగితే

ఆంధ్రప్రదేశ్ రాజధానిలో తెలుగు, హిందీ, కన్నడం, మరాఠీ, మలయాళీ చిత్రాలు ఏడాదికి పాతిక వరకు నిర్మించబడే అవకాశం వుంటుంది. 1970 కి ఇది తప్పకుండా సాధ్యమౌతుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిలిం ల్యాండ్‌కని అటవీ శాఖనుంచి 206 ఎకరాల స్థలం కేటాయించడమే కాక, రెండు స్టుడియోల నిర్మాణానికని ఇరవయ్యేసి ఎకరాలను ఇద్దరికి చౌక ధరకు యిచ్చి, యంత్ర సామగ్రికని వడ్డీ లేకుండా చెరి ఐదు లక్షల రూపాయల ధనం సమకూర్చింది.

విదేశాల నుంచి సాధన సామగ్రి తెప్పించుకోనడంలో, బేగంపేట విమానాశ్రయం నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంతం మీదుగా 'బ్రహ్మానంద చిత్రపురి'కి దగ్గర దోవ నిర్మించడంలో ప్రభుత్వం సహాయపడుతుంది.

ఫిలిం కాలనీ, అనుబంధ సాధన కర్మాగారాలు కూడా ఈ హయత్ నగర్ పురిలో నిర్మించబడవచ్చు. హైదరాబాద్ - విజయవాడ రోడ్డులో రాజధానీ నగర కేంద్రానికి ఎనిమిది మైళ్ళ దూరంలో 206 ఎకరాలపై 'బ్రహ్మానంద చిత్ర పురి' వెలసింది. ఇంకా భవనాలు, వివిధ విభాగాలు తల యెత్తవలసి వుంది.

అమెరికాలోని కాలిఫోర్నియాలోని కాల్వర్‌సిటీలో ఎమ్. జి. ఎమ్. స్టుడియోలో, అనుబంధ నిర్మాణాలు 187 ఎకరాల స్థలంలో వున్నాయి. మన ఫిలిం ల్యాండ్ ఇంకా పెద్దదన్నమాట! ఎమ్. జి. ఎమ్. ఎంపైర్‌లో 33 సౌండ్ స్టేజెస్, 195 భవనాలు, 117 ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ శాఖలు, 254 స్పెషలైజ్‌డ్ విభాగాలు వున్నాయి. కార్మికులు, కళాకారులు 3000 మంది పనిచేస్తున్నారు.

అమెరికాలో హాలీవుడ్ వలె హైదరాబాద్‌లో మినియేచర్ హాలీవుడ్ సర్వాంగ సుందరంగా సమగ్ర కళా సాంకేతిక నిలయంగా పెంపొంది ఆంధ్రులకు నిజమైన బ్రహ్మానందం కలిగించుగాక!

నవంబర్‌లో మరి రెండు గొప్ప విశేషాలు

నవంబర్ ఒకటవ తేదీన 'బ్రహ్మానంద చిత్రపురి' ప్రారంభమైంది. నవంబర్‌లోనే మరి రెండు గొప్ప విశేషాలు జరిగాయి. వాటి వివర మిది :

శాంతారామ్

శాంతారామ్ రాజకమల్ కళా మందిర్ రజతోత్సవం బొంబాయిలో నవంబర్ మూడవ తేదీన జరిగింది.



"రణభేరి"లో హాజీ శ్రీ. కాంతారావు

* * *



"పెద్దక్కయ్య"లో జ్యోతిలక్ష్మి

ఆద్మీ పడో స [ప్రభాత్] ఝనక్ ఝ క్ పాయల్ బాజే దో ఆ ఖే బారా హాత్ అమర్ భూపా లీ [రాజక మల్ కళా మందిర్] వ టి గొప్ప చి త్రాలు తీసిన శా తా రామ్ తానింకా మంచి చి త్రం తీయలేదని తీసే వరకు ర గ లో వు ంటా న ని అన్నారు ని మా కా ల ం మారి పో యి ం దని ఈ కాలం వారితో నెగ్గ డం కష్టమేనని అన్నారు తనకు న్యూ థి యే టర్స్ రంజిత్, సాగర్ మినర్వా వంటి ంం ల పోటీ యిప్పుడు లేక పోవడం వి చా ర క ర మన్నారు

శాంతారామ్ తాజా చిత్రం 'బూంద్ జో బన్ గయా మోతీ' ఇంకా విడుదల కావలసి వుంది.

దాదాపు పది చిత్రాలకి కొత్త నాయిని పరిచయం చేసిన శాంతారామ్, సంధ్య వచ్చాక ఆ పద్ధతి విడిచాడు. శాంతారామ్ గొప్ప క్రమశిక్షణపరుడు. కూతురు రాజశ్రీని స్క్రీన్ చెయ్యలేదు.

శాంతారామ్‌కు తెలుగువారన్నా, తెలుగు చిత్రాలన్నా ప్రీతి మెండు. 'ఆద్మీ'లో 'మరలె పూవులైనా' అంటూ తెలుగు పెట్టారు. షాహీ నీవారి సుకుంగళి చూశాక



'రింబ స్వప్న'లో కృష్ణకుమారి

*   *   *

'పూలరంగడు'లో నాగేశ్వరరావు



తానూ తెలుగు చిత్రం తీయాలని కలలు కన్నా నన్నారు.

మొన్నీ మధ్య శ్రీ బి. ఎన్. రెడ్డి వి. శాంతారామ్‌ను కలుసుకొన్నప్పుడు 'మన మిద్దరం పాత కాలం వాళ్ళం. ప నక పడ్డాం. అయినా ఈ కాలం వాళ్ళకు మన కాలం రుచి యథాశక్తి చూపిస్తూనే వుండాలి' అని అన్నారు. 190' నవంబర్ 18 న కొల్హాపూర్‌లో జన్మించిన వనకుడె శాంతారామ్ 1920 లో సినిమా రంగంలో ప్రవేశించారు. 1926 లో తొలి చిత్రం 'నేతాజి పాల్కర్' (మూకీ) డైరెక్ట్ చేశారు.

రామారావు ద్విపాత్రాభినయం

డి. వి. ఎస్. ప్రొడక్షన్స్ వారి 'తిక్క శంకరయ్య'లో రామారావు ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఒకటి పిచ్చివాని పాత్ర. మరొకటి మంచివాని పాత్ర. పిచ్చివానికి జయలలిత జోడీ. మంచివానికి కృష్ణకుమారి జోడీ. డి. వి. ఎస్. రాజు, యోగానంద్, టి. వి. రాజు, డి. వి. నరసరాజు యూనిట్ ముఖ్యులు.

సావిత్రితో గోష్ఠి

శ్రీ మాతా ఫిలిమ్స్ పేరిట నటి సావిత్రి 'చిన్నారి మనసులు' నిర్మిస్తున్న సందర్భంలో ఆమెతో ఇష్టాగోష్ఠి జరిగింది :

ప్రశ్న : మీ సంస్థపేరు మాతా ఫిలిమ్స్. మీ సంస్థ ముఖ్య డైరెక్టర్లు స్త్రీలు. మీ చిత్రం కథ లక్ష్యం స్త్రీ సమస్యాత్మకమైనదా ?

జవాబు : తప్పకుండా. భార్యాభర్తలు ఒకరినొకరు ఎలా అర్థంచేసుకొని సంచరించాలి అన్నది మా పిక్చర్ సెంట్రల్ థీమ్. రక్తసంబంధం పైన, పిల్లల మైత్రిపైన కూడా కథ కొంత సాగుతుంది. భార్య మనసు భర్తా, భర్త మనసు భార్యా తెలుసుకోవాలనేదే మా చిత్రం ప్రధానంగా చెప్పేది.

ప్ర : అయితే స్త్రీ సమస్యకు సంబంధించిన పేరుకాక బాలలకు సంబంధించిన 'చిన్నారి మనసులు' అనే పేరు పెట్టారే ? అది బాలల చిత్రం అన్న అర్థాన్ని స్ఫురింప జేయడంలేదా ?

జ : లేదనే నా అభిప్రాయం. పిల్లలు భార్యాభర్తలిద్దరికి సెంట్రల్ ఫిగర్స్. అంచేత మా టైటిల్ సరైనదే.

ప్ర : అసలు మీకు డైరెక్టు చెయ్యాలని కోరిక ఎందుకు పుట్టింది?

జ : లావెక్కినందువల్ల అని చాలా మంది అన్నారు. సినిమాలలో మంచి ఛాన్సులు రాకపోవడంవల్ల అని మరికొందరన్నారు.

ప్ర : నాకు కావలసింది మీరేమి అంటారని ?

జ : ఒకసారి అన్నపూర్ణాసంస్థ



"చిన్నారి మనసులు" చిత్రం ప్రారంభోత్సవ సందర్భంలో ప్రసంగిస్తున్న

శ్రీమతి సావిత్రి

మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ దుక్కిపాటి మధుసూదనరావుగారు అన్నారు: నిన్న మొన్నటి డైరెక్టర్లు బాగా బిజీ అయిపోతున్నారు. నగరాలు, భాషలు దాటేస్తున్నారు. సబ్జెక్టుపై బాగా కాన్‌సెన్‌ట్రేట్ చేసే డైరెక్టర్లు కావాలి. మీరెందుకు డైరెక్షన్‌లో దిగరాదని...

ప్ర : వెంటనే దిగేశారా ?

జ : శ్రీ మధుసూదనరావుగారి సూచన విన్నాక బహువిధాల, బహుకాలం ఆలోచించాను. దాదాపు 150 చిత్రాల అనుభవం వెనుకవుంది. ఎందుకు ఒక చెయ్యి వెయ్యరాదని ఆలోచించి ఆలోచించి శ్రీమతి వి. సరోజని మధుసూదనరావువంటి మిత్రురాండ్రు కూడా కలసిరాగా సావిత్రి ఒక్కతే కాదు, ఇంకా చాలా మంది సినిమా సబలలు వున్నారనే చూపించ సాహసించాను.

ప్ర : మీ పిక్చర్‌లో మొదటి షాట్ తీసేటప్పుడు వణుకు పుట్టిందా ? మీరు మొదటి చిత్రంలో మొదటిసారి కెమెరాను ఫేస్ చేసినప్పుడు ఎలా ఫీల్ అయ్యారు ? మొదటి దర్శకత్వపు దృశ్యం వద్ద ఆదేశమివ్వబోయేటప్పుడు ఎలా ఫీల్ అయ్యారు ? ఈ రెండింటికి వ్యత్యాసం ఏమైనా వుందా ?

జ : తొలిరోజు నటిగా కెమెరా ముందు నిలచినపుడు ఏమీ తెలియని తనంవల్ల ఏ థ్రిల్లూ పొందలేదు. వణకనూ లేదు. తొలిసారిగా దర్శకురాలై కెమెరావద్ద నిలబడి షాట్స్ నిర్ణయిస్తున్నప్పుడూ మరే థ్రిల్లూ పొందలేదు; అసలు వణకనే లేదు. కారణం నా 150 చిత్రాల బలం బ్రదర్ !

ప్ర : మంచిది. మీ డైరెక్షన్ ప్రభావం ఈసరికి ప్రకాశించి మరికొన్ని

చిత్రాలకు డైరెక్షన్‌ల ఆఫర్‌లు వచ్చాయా ?

జ : (నవ్వు ఆపుకోలేక) మరే కొత్త ఛాన్సులూ రాలేదు. కాని మా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి వి. సరోజిని మధుసూదన రావు నేను ఇతర పిక్చర్‌ల డైరెక్షన్‌కు ఒప్పుకోకుండా మా సంస్థ బ్యానర్‌లోనే ముందు నాలుగు చిత్రాలు తీసేందుకు సైన్ చేయించుకొన్నారు.

ప్ర : ఇందాక మీరు ఎవరో ఏవేవో అన్నారన్నారు. అవి నాకెందుకుకాని స్వంతచిత్రంలో మీరు నటించడం లేదేమి ? తగిన భూమిక లేదా ? లేక ...

జ నాకు తగిన పాత్ర వుంది. కాని దర్శకత్వం అనగానే అందులో కొత్త కాబట్టి, తోటి టెక్నీషియన్‌లుకూడా చాలామందికీ కొత్త కాబట్టి యాక్టింగ్‌కు దిగితే డైరెక్షన్‌పై కాన్‌సెన్‌ట్రేట్ చెయ్యలేను. అంచేత పెద్ద భూమిక ధరించడం లేదు.

ప్ర అంటే ...

జ : ఏదో ఒకటి రెండు సీనులలో కన్పించే చిన్న భూమిక ధరిస్తాను.

ప్ర : మీ తోటి స్త్రీ టెక్నీషియనులు ఇంతవరకు ఎలా వున్నారు. ?

జ : ఇంతవరకేమిటి, ఎప్పటికీ బాగానే వుంటారు. రెండేసి మూడేసిబాధ్యతలువహించగలవారు కూడా మా స్త్రీ బృందంలో వున్నారు.

ప్ర : ఏమా బహు బాధ్యతాభినయం ?

జ . శ్రీమతి వి. సరోజిని మా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మాత్రమే కాదు మా చిత్ర కథకురాలు, మా చిత్రానికి పాటలుకూడా వ్రాశారు. హిట్స్ అవుతాయి. సంగీత దర్శకురాలు పి లీల, శాస్త్ర, లలిత సంగీతాలలో సవ్యసాచిని, పాడారు, స్వర సారథ్యం వహించారు నృత్య దర్శకురాలు శ్రీమతి రాజసులోచన బహుముఖ శక్తి సామర్థ్యాల గురించి వేరే చెప్పనవసరం లేదు. కళా దర్శకురాలు కుమారి మోహన.

ప్ర . రేపటికి ఎవరికైనా శిక్షణ నిస్తున్నారా ?

జ . సహాయ దర్శకురాలుగా కొప్పరపు సరోజిని పనిచేస్తున్నారు. మా తర్వాతి చిత్రానికి సంభాషణలు ఒక రచయిత్రిచే వ్రాయించాలనేదే నా సంకల్పం. సంభాషణలు అనగానే చాలా ఓపికవుండాలి ఒకటికి నాలుగుసార్లు వ్రాయాలి. సహనానికి మారుపేరు స్త్రీ. కలం సంగతి వచ్చేసరికి ఈ సహనం లోపిస్తున్నదేమో అనుకొంటున్నాను. ఏమైనా వచ్చేసారి స్త్రీ మాటల కలంపట్టి తీరుతుంది.

ప్ర . శుభం. ఇంతకీ నలుగురు

స్త్రీలను కూడగట్టుకొని ఆ కొత్తదనంతో నాలుగు రాళ్ళు కళ్ళ చూడడమే మీ సంకల్పమా, లేక...

జ: ఆ తర్వాత నన్ను చెప్ప నివ్వండి. మా చిత్రంపై వచ్చే లాభంలో కొంత అనాధశరణాలయాలకు, బధిర బాలలకు, వృద్ధ కళాకారిణులకు విరాళంగా యిస్తాము.

ప్ర. మీ చిత్రం రషెస్ జెమినీ గణేష్, వి. మధుసూదనరావు, సి.ఎస్.రావుచూశారా? ఏమన్నారు?

జ' చూడలేదు. చూసితీరాలని ఎవరైనా అంటే అది...

*　　　　*

జగపతి రాజేంద్రప్రసాద్, మధు పిక్చర్స్ మల్లిఖార్జునరావుగారలు కలిసి ఒక జానపదం తీస్తారు. దర్శకుడు విరలాచార్య, జనవరిలో షూటింగ్ ప్రారంభం కావచ్చు.

□□□

ఉత్తరాలు

"చీకటి" కథ చూడగానే అనాటి చీకటి గుర్తొచ్చింది. అనాడు – అంటే గత వేసవి ముందు – ఓనాడు – చీకటిలో సెకండ్ షో – లీలామహల్‌కి వెళ్తున్నానని చెప్పిన శ్రీరంగం రాజేశ్వరరావు మళ్ళీ కలవలేదు. ఈ కథ ద్వారా అతన్ని 'జ్యోతి'లో కల్సుకో గల్గినందుకు ఆనందిస్తున్నాను. ఎక్కడున్నా 'శ్రీ రంగం' నా అభినందనలు అందుకోగలడని ఆశిస్తున్నాను.

— అందే గోపాలకృష్ణమూర్తి,
వాల్తేరు.

జనవరి నెల విజయవాడలో కృష్ణాజిల్లా రచయితల సభ జరిగింది. ఆ రోజు 'ఆదివిష్ణు'గారు హడావిడిగావచ్చి నన్నుబయటికి పిల్చారు. ఎదురుగా తెల్లగా, పీలగా, నాజూగ్గా ఉన్న మనిషిని చూపిస్తూ 'ఈయనే, శ్రీరంగం రాజేశ్వరరావుగారు' అన్నారు. నేను కాస్త ఆశ్చర్యపోయాను. అక్కడ కూడిన రచయితలలో ఆయనదే చిన్న వయస్సనిపించింది. జ్యోతి పత్రికలో ప్రచురించబడిన ఆయన కథలు చాలా పాప్యులరయ్యాయి. మంచి 'పవర్‌ఫుల్ రైటర'నిపించుకున్నారు. భయంకరమైన చీకటి గురించి చిక్కని కథ వ్రాసి ముక్కుపచ్చలారని చిన్నతనంలోనే 'చీకటి'ని వరించినా, ఆయన రచనలు పాఠకుల హృదయాల్లో మాయని గుర్తులుగా నిలిచిపోతాయి.

— తాడిమళ్ళ రామకృష్ణ,
పర్భని, [మహారాష్ట్ర]

'జ్యోతి' లో ముఖ్యముగా ఆసక్తికరముగా వుండేవి జోక్సు, 'పనికిరాని పరిజ్ఞానం.' ఇంకా వున్నాయి అనుకోండి! నవంబర్ సంచికలో 'పనికిరానిపరిజ్ఞానం'లో తప్పు వెలువడిందని తెలుపుటకు చింతిస్తున్నాను. ఎందుకంటే సామాన్యముగా తప్పులు అంటూ కనపడవు. బాబ్జీగారు ఇచ్చిన 44 అంకెల సంఖ్యను 9తో హెచ్చవేయవలసి వచ్చినప్పుడే చివరి అంక 9 ముందు పెడితే ఫలితము వస్తుందన్న మాట! మరి బాబ్జిగారు ఎందుకని ఈవిషయము గమనించ లేదో?

—డి. ప్రేమచంద్, హైదరాబాద్.

[తాము తప్పులో కాలు వేసినట్టు బాబ్జీగారు అంగీకరిస్తున్నారు –సం.



ఇలా చేయడము ప్రమాదకరము!

ఎండిన గులిమిని స్టెరిలైజ్ చేయని వాడియైన పనిముట్లతో తీయుటకు ప్రయత్నించడము ప్రమాదకరము అవవచ్చును దానితో సెప్టిక్ అయే పరిస్థితులు ఏర్పడి, శాశ్వతముగా చెవి సొరవుటయే కాక చెముడు కూడ రావచ్చును





ఇలా చేయడము ఖర్చు ఎక్కువ!

వినుటకు ఉపయోగించే సాధనములు ఖరీదైనవి మరియు చికాకైనవి చెవులు సరిగా వినపడక పోవుట, చెవిలో హోరుమని ధ్వని, వాపు దురద మరియు బాధలకు మామూలుగా చెవిలో ఎండిన గులిమియే కారణము

నిషక్
చెవిపోటు మందు
తక్కువ ఖర్చులో మీ
చెవులను శాస్త్రరీత్యా
రక్షణ కలిగిస్తుంది






నిషక్ ఔషధయుక్తమైన చెవిపోటు మందు. చెవిలో ఎండిన గులిమిని, దుమ్ము మొదలైన వాటిని తీసి వేయుటకు, చెవులను శాస్త్రరీత్యా శుభ్రము చేయుటకు, వాపు మరియు బాధను కలిగించే రోగములను, సూక్ష్మ క్రిములను సౌమ్యముగా నాశనము చేయుటకు తయారుచేయబడినది నిషక్ చెవిపోటు మందు దురదను, బాధను వెంటనే పోగొట్టును, సూక్ష్మ క్రిముల ద్వారా మళ్ళీ రోగములు కలుగకుండా కాపాడును.. అందువలన వినబడే శక్తిని బాగుచేయును.

100 మందిలో 8 గురు చిన్న పిల్లలు గులిమి, చెవి రోగములతో సరిగా వినపడక బాధపడుతున్నారని లెక్కల ద్వారా నిరూపించబడినది. పెద్దవారిలో ఈ శాతము ఇంకా ఎక్కువే ఉండవచ్చును.

నిరపాయమైనది మరియు సౌమ్యమైనది. క్రమముగా వాడదగినది.



ఆఖరికి... ఒక క్రొత్త శాస్త్రరీత్యా తయారైన ఫార్ములా

నిషక్

ఔషధయుక్తమైన చెవిపోటు మందు

- గులిమిని కరగించును
- రోగములను నివారించును
- బాధను పోగొట్టును
- బాగుగా వినపడేలా చేయును

కొచ్చిన్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ బొంబాయి-28 – కొచ్చిన్-2 ● నిజాల్ మెలిమల క్రీమును తయారుచేయువారు

దీపావళి సంచిక

"దీపావళి సంచిక" అనుకొన్న దానికంటె చాలా అందంగా ఉంది. ముఖ్యంగా ఈ లేఖ వ్రాయడానికి కారణం, శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మగారి రచన "ఆర్తనాదం" చదివిన ఉత్తేజకరంగాలో కలిగిన భావోద్రేకం ఈ విధంగా తెలియ జేస్తూన్నాను. వీరి రచనలు రమారమి అన్నీ నేను చదివాను. శైలిగాని, పాత్రల నిరూపణగాని ఒకదాన్ని మించినది మరొకటి. ఏ విషయం అయినా హృదయాలకు హత్తుకుపోయే విధంగా చిత్రించుటలో వీరికి వీరే సాటి. అంతా మన కళ్ళ ముందర జరిగినట్లు, అందులోని పాత్రలు అనుభవించే కష్టసుఖాలు చదువరులు అనుభవిస్తున్నట్లు ఆయా పాత్రలలో నిమగ్నులౌతున్నట్లు ప్రతీ సంఘటనా హృదయాలను కదలించే [సుఖంగానీ, దుఃఖము గానీ] విధంగా చాలా సహజంగా వ్రాయుటలో వీరిని మించినవారు లేరని నా అభిప్రాయం.

—ముత్తా లక్ష్మణరావు, కాకినాడ.

దీపావళి ప్రత్యేక సంచికలో ముప్పాళ రంగనాయకమ్మగారి కథ బాగానే ఉంది. కాని కథానాయకుడు పనిమనిషి విషయంలో ఆ విధంగా ప్రవర్తిస్తాడనటంలో అసహజత్వం కనిపిస్తుంది. రచయిత్రి వర్ణించిన విధంగా ఉన్నా ఆ పనిమనిషిని అరుణ భర్త వాంఛించాడంటే అంత కంటే ఘోరమయిన విషయం మరొకటి ఉండదు. అంత వరకూ మంచి నడవడికకల పురుషుని చివరలో అలా చేయటం విచారించదగిన విషయం. శ్రీమతి రంగనాయకమ్మగారికి పురుషులంటే అంత ఏహ్యభావం ఎందుకో అర్థం కాదు.

— బి. ఎస్. సోమయాజులు.
హైదరాబాదు.

కథలలో ముప్పాళ రంగనాయకమ్మగారి "ఆర్తనాదం" కథ ది బెస్ట్. ఇకపోతే సింగరాజు రామచంద్రమూర్తిగారి "రంగులు" మధురాంతకం రాజారాంగారి "కార్టూన్" కథల్లో చక్కని హాస్యం తొంగి చూస్తున్నది ముఖ్యంగా "రంగులు" కథ చివరి ట్విస్టు చెప్పుకో దగ్గది. కాని ఒక్కటి మాత్రం చెప్పక తప్పదు. పుస్తకమంతా ఏదో కథల పుస్తకం లాగా ఉన్నది. కాని మా జ్యోతి మాస పత్రికలా లేదు. కారణం కార్టూన్స్, జోక్స్, హాస్య రచనలు లేకపోవటమే.

—నార్ల గంగాప్రసాద్, పరుచూరు.

కాంతారావుగారి "పులి", వీరాజీగారి "లక్ష", బీనాదేవిగారి "ఆత్మహత్య" అంగరగారి "గుర్రం" కథలు ప్రత్యేక జ్యోతులు.

— మైత్రేయి, సుదర్శి,
(తాడేపల్లి)

□□□

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Jyothi Printers,
Congress officeRoad, Governorpet, Vijayawada-2.